తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 261 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | ఆదివారం, ఆగస్టు 09, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

వందేమాతరం గేయానికి మరిన్ని రక్షణలు కల్పించే నేషనల్ ఆనర్ యాక్ట్-2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడాన్ని నేరంగా గుర్తించేలా 1971 నాటి చట్టానికి కేంద్రం తాజాగా మార్పులు చేసిన విషయం తెలిసిందే. జాతీయ గీతం స్థాయిలో వందేమాతరం గేయానికి రక్షణ కల్పించేలా ఈ మార్పులు చేసింది. ఇటీవలే పార్లమెంటు ఆమోదించిన బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. తాజాగా నిబంధనల ప్రకారం, జాతీయ గీతం లేదా గేయం ఆలాపనను అడ్డుకున్న వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ పాటల ఆలాపన జరుగుతున్న సమయంలో అడ్డంకులు సృష్టించేవారికీ ఇవే శిక్షలు విధిస్తారు. అంతకుముందున్న చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం, కేవలం జాతీయ గీతానికి ఈ రక్షణలు ఉండేవి. ప్రస్తుతం వందేమాతరం గేయానికీ ఇవే రక్షణలు కల్పిస్తూ చట్టంలో మార్పులు చేశారు.

ప్రాజెక్టుల కింద ఇప్పుడు వరిసాగు సముచితం కాదు

హైదరాబాద్: “ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలతో రాష్ట్రంలో కొంత ఉపశమనం లభించింది. అయినప్పటికీ ఇప్పుడు ప్రాజెక్టుల కింద ఉన్న రైతులు వరి సాగుకు వెళ్లడం సముచితం కాదు. ఒకసారి తడి అందే అవకాశం లభించినా, రెండోసారి నీరందించే పరిస్థితి అనిశ్చితిగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రోత్సహించి రైతులతో పంట వేయించి, రెండు మూడు నెలల తర్వాత ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదు” అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ..‘ ప్రతి కమాండ్ ఏరియాలో ఎంత మేరకు సాగునీరు అందించగలమో, ఎక్కడ పరిమితులున్నాయో కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు రైతులకు అధికారికంగా తెలియజేయాలి. ప్రధాన జలాశయాల ప్రస్తుత పరిస్థితిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. నాగార్జునసాగర్, శ్రీరామసాగర్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదు. వాటి పరిధిలో తక్కువ నీటితో పండే పంటల సాగును ప్రోత్సహించాలి’ అని సూచించారు.

నేటి నుంచే నీటిపారుదల సలహా మండళ్ల సమావేశాలు

రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ‘ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత అధికారులతో కూడిన జిల్లా నీటిపారుదల సలహా మండళ్లు సమావేశం కావాలి. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా శనివారం నుంచే ఈ మండళ్ల సమావేశాలు ప్రారంభించాలి. వచ్చే వేసవిలో తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి నిల్వలను పరిరక్షించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 61 లక్షల మంది కొత్త లబ్ధిదారులను చేర్చి దాదాపు 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని సీఎం ప్రారంభిస్తారు’ అని మంత్రి తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు: మంత్రి ఉత్తమ్

రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15న ప్రారంభించనున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జిల్లాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.



రాజకీయ ఒత్తిళ్లకు లోనై విచక్షణ రహితంగా నీటిని విడుదల చేయొద్దు
జిల్లా నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ
ఆగస్టు 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్న సీఎం
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

‘ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 సంగారెడ్డిలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంతో రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారు’అని మంత్రి వివరించారు. ‘ఆగస్టు 15న ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కావాలి’అని ఉత్తమ్ ఆదేశించారు. ‘తెలంగాణలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుంది. స్వతంత్ర భారతదేశంలో అత్యంత సమర్థమైన ఆహార భద్రతా కార్యక్రమంలో చిన్న పాత్ర పోషించడం నాకు ఆనందంగా ఉంది’అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రశ్నించడం కాదు.. పరిష్కారం చూపాలి: యువతకు మోదీ పిలుపు



దేశ యువతరం సామర్థ్యాలపై తమకు ఎంతో విశ్వాసం ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా సాగే మన దేశ ప్రయాణానికి వారి అవసరం ఎంతో ఉందని తెలిపారు. అయితే, ఏ తరం వారైనా దేశ బాధ్యతను విస్మరించొద్దని సూచించారు. ఐఐటీ దిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ప్రధాని ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మోదీ ప్రసంగించారు.

“ఐఐటీ దిల్లీ గ్రాడ్యుయేట్ల పట్ల గర్వంగా ఉంది. ఇప్పుడు చదువు పూర్తిచేసుకుని మీరు (విద్యార్థులు) అడుగుపెట్టే బయటి ప్రపంచం చాలా వేగంగా మారుతోంది. సాంకేతికత దగ్గర్నుంచి అనేక రంగాల్లో విస్తృత మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాబోయే 20-30 ఏళ్లలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. అందువల్ల జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండాలి. నిత్య విద్యార్థిలా నేర్చుకోవాలి. అలాంటి వారే విజేతలుగా నిలుస్తారు” అని మోదీ విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు.

ప్రశ్నించడం మాత్రమే కాదు..

“మార్పు అనేది సవాళ్లు, అవకాశాలతో కూడుకుని ఉంటుంది. జీవితం మనకు ఎన్నో సమస్యలు తీసుకొస్తుంది. కానీ, ఆ సమస్యలే అవకాశాలు కల్పిస్తాయి. మీకు పెద్ద సవాలు ఎదురైనప్పుడు దాన్ని చూసి భయపడకండి. దాన్ని చిన్న చిన్న భాగాలుగా విడదీసి చూడండి. కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యమే సవాళ్లను అవకాశాలుగా మార్చగలదు. అందుకే, ప్రశ్నించడం కాదు.. సమస్యకు పరిష్కారం కనుగొనడంపై దృష్టిపెట్టాలి” అని మోదీ సూచించారు.

“ప్రతి తరానికి జాతీయ బాధ్యత ఉంటుంది. దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత కూడా భాగస్వామి కావాలి. వచ్చే 30-35 ఏళ్లలో మీరు ఏం చేస్తున్నారన్నదే.. వికసిత్ భారత్‌ను నిర్ణయిస్తుంది. అందువల్ల మీరు తీసుకునే ఏ నిర్ణయమైనా సరే.. ఈ దేశానికి ఏ విధంగా ఉపయోగపడుతుందనేది ఆలోచించాలి. దేశ ప్రయోజనాల కోసం మనం ఏం చేయగలమనేది ప్రశ్నించుకోవాలి” అని ప్రధాని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను ప్రదానం చేశారు. పతకాలు స్వీకరించిన వారిలో ఒకరిద్దరే మహిళలు ఉన్నారని, వీరి సంఖ్య ఎక్కువగా ఉంటే బాగుండేదని మోదీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఐఐటీ దిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రమైన ‘పరం ప్రజ్ఞ’ను ఆయన ప్రారంభించారు.

రెండేళ్లలో హ్యామ్ రోడ్లు పూర్తి చేయడమే లక్ష్యం

అనుమతుల పేరుతో కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టొద్దు
సమీక్షలో అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, : తెలంగాణవ్యాప్తంగా 2028 ఆగస్టు నాటికి హ్యామ్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే తమ లక్ష్యమని, అనుమతుల పేరిట కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేయొద్దని అధికారులకు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టంచేశారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. వివేక్‌తో కలిసి శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో కోమటిరెడ్డి మాట్లాడుతూ.. “రూ.5 కోట్ల పనికి రూ.54 కోట్ల జరిమానా విధించడం దుర్మార్గం. అక్రమ మైనింగ్‌పై కఠినంగా ఉండాల్సిన అధికారులు... అభివృద్ధి పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లపై దౌర్జన్యంగా వ్యవహరించడం సరికాదు. హ్యామ్ రోడ్ల పనులు సామగ్రి కొరతతో ఆగిపోకుండా అవసరమైన అనుమతులు వేగంగా వచ్చేలా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలి” అని అధికారులను ఆదేశించారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. హ్యామ్ రోడ్ల నిర్మాణ సామగ్రి నిరంతరం అందుబాటులో ఉండేలా సమన్వయంతో పనిచేయాలని స్పష్టంచేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, టీజీఎండీసీ ఎండీ అనుదీప్ దురిశెట్టి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ బి.వి.రావు(హ్యామ్ రోడ్లు), మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్, ఫ్రాన్స్ రఫేల్ డీల్

న్యూఢిల్లీ, ఆగస్టు 8, (న్యూస్ పల్స్): భారత ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాల కొరతను తీర్చడానికి ఫ్రాన్స్ సమర్పించిన రూ.3.25 లక్షల కోట్ల రఫేల్ ప్రతిపాదన కేవలం కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు. ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ దిశగా ముఖ్యమైన అడుగు. 114 జెట్లలో 94 దేశంలోనే తయారు చేస్తామని ఫ్రాన్స్ తెలిపింది. దీంతో టెక్నాలజీ బదిలీ, స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలకు భారీ అవకాశాలు కలుగుతాయి.ఫ్రాన్స్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 114 రఫేల్ జెట్లలో 94 భారత్‌లోనే ఉత్పత్తి అవుతాయి. కొన్ని విమానాలు ఫ్లై?అవే కండిషన్‌లో వస్తాయి, మిగతావి దేశీయ భాగస్వామ్యంతో తయారవుతాయి. ఇది గత రఫేల్ ఒప్పందాలకు భిన్నంగా, మొట్టమొదటిసారి రఫేల్‌ను ఫ్రాన్స్ వెలుపల పెద్ద ఎత్తున తయారు చేయబోతోంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్లు, అవయోనిక్స్‌లో స్థానిక కంటెంట్ 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ స్వయంప్రతిపత్తి పెరుగుతుంది, భవిష్యత్తులో సొంత యుద్ధ విమానాల అభివృద్ధికి అనుభవం లభిస్తుంది.ఈ ఒప్పందం ఆమోదమైతే భారతీయ కంపెనీలకు దాదాపు రూ.1.6 లక్షల కోట్ల వ్యాపారం వస్తుందని అంచనా. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, లార్సెన్ ? టూబ్రో వంటి సంస్థలు ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ అసెంబ్లీ, అవయోనిక్స్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌లో పాల్గొంటాయి. ఫ్రెంచ్ కంపెనీలు డసాల్ట్, సఫ్రాన్, థేల్స్, ఎంబీడీఏ భారత భాగస్వాములతో కలిసి పనిచేస్తాయి. ఇది ఏరోస్పేస్ సప్లై చైన్‌ను బలోపేతం చేసి, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్థానిక ఆయుధాలు ఇంటిగ్రేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.రఫేల్ విడిభాగాల తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటవుతుంది. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో ఫ్యూజ్‌లేజ్(ఫ్యూస్‌లేజ్) తయారీ ఒప్పందాలు ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను ఏరోస్పేస్ హబ్‌గా మరింత బలపరుస్తుంది. ఇంజిన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌వో) సౌకర్యాలు కూడా ఇక్కడే రావచ్చు. దీనివల్ల తెలంగాణలో ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయి.భారత వాయుసేన స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఈ జెట్లు ముఖ్యం. ప్రస్తుతం ఉన్న 36 రఫేల్‌లకు జోడించి మొత్తం సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 4.5 జనరేషన్ మల్టీ?రోల్ సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు శత్రు దేశాలపై నిరోధక శక్తిని పెంచుతాయి. టెక్నాలజీ బదిలీతో భవిష్యత్తు స్వదేశీ విమానాల అభివృద్ధికి కూడా సహాయపడుతుంది.ప్రతిపాదనను రక్షణ శాఖ, వాయుసేన పరిశీలిస్తున్నాయి. ధర, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ స్థాయి, ఇండిజినస్ కంటెంట్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌పై చర్చలు జరుగుతాయి.

నీళ్లపై భారాసది రాజకీయ డ్రామా

సీఎం సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ తప్పుడు ప్రచారం
ఆ పార్టీ నేతలపై మంత్రి జూపల్లి మండిపాటు



హైదరాబాద్, : నీళ్లపై భారాస పార్టీది రాజకీయ డ్రామా అని, రాజకీయంగా పబ్బం గడుపుకొనే పన్నాగమని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తూ... ఆ పార్టీ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 100% పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఈఎన్సీ-జనరల్ రవీష్‌బాబు, సీఈ విజయభాస్కర్‌రెడ్డిలతో కలిసి జూపల్లి శుక్రవారం సచివాలయం మీడియా సెంటర్‌లో మాట్లాడారు.

“ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నీటి పారుదల శాఖ అధికారుల ప్రణాళిక మేరకే జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిలసాగర్ ప్రాజెక్టులకు నీటి నిర్వహణ జరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలతోపాటు ఇతర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. దానికి అనుగుణంగా అధికారులు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేస్తున్నారు. ఈ విషయం ముందే తెలుసుకుంటున్న భారాస నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తూ.. తమ ఒత్తిడితోనే అధికారులు నీటిని వదులుతున్నారని ప్రచారం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టులను పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారాస నిర్లక్ష్యం చేసింది. పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను విస్మరించింది. కల్వకుర్తి కింద అదనంగా 25 టీఎంసీల నీటిని అందించే ప్రాజెక్టును ఎందుకు నిర్మించలేదు? మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారు’ అని జూపల్లి మండిపడ్డారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

ఆదివారం, ఆగస్టు 09, 2026

ఎక్కడ చూసినా జెన్‌జీ, జెన్ ఆల్ఫా గురించి మాటలే

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా జెన్‌జీ, జెన్ ఆల్ఫా గురించి మాటలే. 25 ఏళ్ల లోపు వయసున్న తరం దేశ భవిష్యత్తును నిర్ణయించేవారు అనే అవగాహన పెరిగింది. దీంతో ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) కూడా జెన్‌జీ కోసం పాకులాడుతుందన్న వార్తలు వస్తున్నాయి. అందుకే యువత వైపు దృష్టి పెట్టిందని చర్చలు జరుగుతున్నాయి. ముంబైలోని నీతా ముకేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో జరుగుతున్న ఒక యువ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొనడం ఈ చర్చను మరింత పెంచింది.ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది ఐఐఎంయూఎన్ (ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్). రిషభ్ షా స్థాపించిన ఈ సంస్థ 15 ఏళ్లుగా యువతలో నాయకత్వం, భారతీయ దృక్పథం, ప్రపంచ సమస్యలపై చర్చలు ప్రోత్సహిస్తోంది. ప్రతీ సంవత్సరం యూత్ కార్యక్రమాలు నిర్వహించే ఈ సంస్థ ఈసారి 100కు పైగా ప్రధాన పట్టణాల నుంచి 15 నుంచి 19 ఏళ్ల వయసున్న వేలాది మంది విద్యార్థులను ఎంపిక చేసింది. నాలుగు రోజుల కార్యక్రమంలో వసతి సౌకర్యాలతో శిక్షణ, చర్చలు జరుగుతాయి. చివరి రోజు మోహన్ భగవత్ జెన్‌జీపై ప్రసంగించి, సంభాషణ జరపడం ప్రత్యేకం. భారత్ భవిష్యత్‌గా పిలిచే యువత నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా నిరుద్యోగం, విద్యారంగంలో విపరీతమైన ఖర్చులు, ప్రభుత్వ సంస్థలపై నమ్మకం తగ్గడం వంటి అంశాలు యువతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో యువత సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకురావడానికి కాక్రోచ్ జనతా పార్టీ ఒక భారీ కార్యాచరణ చేపట్టింది. క్యాబోల్తీ పబ్లిక్‌పేరుతో దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీజేపీ తన భవిష్యత్ ప్రణాళికలను, జాతీయ కార్యవర్గాన్ని వెల్లడించింది. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ప్రత్యక్షంగా క్షేత్ర స్థాయిలో యువతతో మమేకమవ్వడమే ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమని సంస్థ స్పష్టం చేసింది. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీలు, పార్లమెంటు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ ప్రచారం నాలుగు అంశాంపై దృష్టి పెట్టింది. దేశంలో విద్యావంతులైన యువతకు ఉద్యోగాలు లభించకపోవడం అతి పెద్ద సమస్యగా మారింది. పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్‌లలో ఫీజులు ఆకాశాన్ని తాకుతున్నాయి. విద్య అనేది ప్రాథమిక హక్కు అయినప్పటికీ, అది నేడు ఒక వ్యాపారంగా మారి విద్యార్థులపై అప్పుల భారాన్ని మోపుతోందని సీజేపీ ఆరోపించింది. న్యాయవ్యవస్థలో సామాన్యులకు జరుగుతున్న జాప్యం, మీడియా సంస్థలు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజల గొంతుకను వినిపించకపోవడం వంటి అంశాలపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని దీప్కే పేర్కొన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన, ఈ20 ఇంధన విధానం, దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల గురించి యువతకు అవగాహన కల్పించడం.వచ్చే నెల నుంచి క్యా బోల్తీ పబ్లిక్ ప్రచారం దేశవ్యాప్తంగా ప్రారంభంకానుంది. సీజేపీ బృందం దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి యువతతో నేరుగా సంభాషిస్తుంది. వారి ఫిర్యాదులు, అంచనాలు, వారు ఎలాంటి రాజకీయాన్ని కోరుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ పర్యటనలు దోహదపడతాయి. ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి ఒక భారీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ద్వారా ఎవరైనా ఉచితంగా సీజేపీలో సభ్యులుగా చేరవచ్చు. అయితే సభ్యత్వం పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని, ఇది పూర్తిగా ఉచితమని సీజేపీ స్పష్టం చేసింది. ఈ ఉద్యమాన్ని సమర్థవంతంగా నడిపించడానికి13 మంది సభ్యులతో కూడిన తొలి జాతీయ కార్యవర్గాన్ని సీజేపీ ప్రకటించింది. జాతీయ కన్వీనర్‌గా అభిజీత్ దీప్కే, కో- కన్వీనర్లుగా అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ ను నియమించారు. ఈ బృందం గతంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో కీలక పాత్ర పోషించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంలో ఈ నిరసనలే మలుపుగా మారాయని దీప్కే గుర్తు చేశారు. భవిష్యత్‌లో కూడా ప్రజల గొంతుకను వినిపిస్తూ పాలకులను నిలదీస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీజేపీ తనను తాను ఒక రాజకీయ పార్టీగా పిలుచుకున్నప్పటికీ, అది ఎన్నికల బరిలోకి దిగే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. ఇది కేవలం ఒక పబ్లిక్ ప్రెజర్ గ్రూప్‌గా మాత్రమే కొనసాగనుంది. దేశానికి మరో రాజకీయ పార్టీ కంటే నిరంతరం ప్రజల తరఫున పోరాడే ఒక ప్రజా ఉద్యమం అవసరమని అభిజీత్ దీప్కే అభిప్రాయపడ్డారు. “ మనం ఎవరికి వ్యతిరేకంగా పోరాడుతున్నామో, కాలక్రమేణా మనం కూడా అలాగే మారిపోకుండా ఉండటమే మన ముందు ఉన్న అతి పెద్ద సవాల్” అని దీప్కే తన సహచరులకు హితబోధ చేశారు. మరో వైపు జెన్-జీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచంలోనే అతిపెద్ద యువజన సదస్సులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధ్యక్షుడు మోహన్ భగవత్ పాల్గొన్నారు. ‘భారతీయ విధానంలో ప్రపంచాన్ని ఏకం చేయడంలో యువత పాత్ర’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. జెన్-జీ మనవాళ్లేనని, వారు నిరసనలు చేస్తుంటే స్పందించి పరిష్కరించాలని అన్నారు. ఆందోళనలు చేసినంత మాత్రాన వారు దేశద్రోహులు కాదని, మన భవితని భగవత్ ఉద్ఘాటించారు.“ఒకవేళ జెన్- జీ ఆందోళన చేస్తే వారు ఖచ్చితంగా దేశ ద్రోహులు కాదు.. వాళ్లు మన వాళ్లే.. దేశానికి భవిత” అని ఆర్ఎస్ఎస్ చీఫ్ పేర్కొన్నారు. అయితే, యువత ఆందోళనలు చేయొద్దని తాను చెప్పడం లేదని, ప్రజాస్వామ్యంలో నిరసనలు వ్యక్తం చేయడానికి నిర్దిష్టమైన మార్గాలు ఉంటాయని ఆయన తెలిపారు.

- ఎడిటర్

కమలాపురం గ్రామంలో సింగరేణి ఉచిత వైద్య శిబిరం

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 08 తెలంగాణ పవర్ : సింగరేణి సేవ సమితి సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని కమలాపురం గ్రామ నందు శనివారం నాడు సింగరేణి ఉచిత వైద్య శిభిరం నిర్వహించబడినది.

సింగరేణి యాజమాన్యం తమ వంతు సామాజిక బాధ్యతగా బొగ్గు గనుల పరిసర ప్రాంతాల గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో భాగంగా కమలాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో స్త్రీ, పురుషులు, వృద్ధులు ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేసినారు. ఈ వైద్య శిభీరంలో మొత్తం 132 మందికి సాధారణ వ్యాధులకు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు బిపి, షుగర్ వ్యాదిగ్రస్తులను పరీక్షించి వారికి కూడా వ్యాధి నియంత్రణ మందులు ఇవ్వడం జరిగింది. వ్యాధుల బారిన పడకుండా



గృహ వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించవలసిన ఆవశ్యకత పై సింగరేణి వైద్యులు కమలాపురం గ్రామస్తులకు అవగాహన కలిపించడం జరిగిందని ఏజిఎం(పర్సనల్)ఎస్ రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి వైద్యులు డా. ఇన్నయ్య, స్టాఫ్ నర్స్, స్టాఫ్ నర్స్ భవాని, ఆసుపత్రి సిబ్బంది సౌజన్య, మరియు, తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జ్వల్ రికవరీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఘన ప్రారంభోత్సవం

ఉజ్జ్వల్ రికవరీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీ దానం నాగేందర్, హిమాయత్‌నగర్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ శ్రీ మహాలక్ష్మి రమణ గౌడ్, శ్రీ బషీర్ హుస్సేన్, పాస్టర్ సామ్ అబ్రహం, పాస్టర్ కె. ఎం. రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవాన్ని శోభాయమానం చేశారు.

ఈ సంస్థను సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డా. కె. ఎస్. మొయినుద్దీన్ మరియు సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డా. సురేష్ కుమార్ సమాజానికి అత్యుత్తమ రికవరీ మరియు పునరావాస సేవలను అందించాలనే మహత్తర లక్ష్యంతో స్థాపించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన డా. కె. ఎస్. మొయినుద్దీన్ మాట్లాడుతూ, అనారోగ్యం లేదా దీర్ఘకాలిక వైద్య చికిత్స అనంతరం రోగులు తిరిగి సాధారణ జీవితంలోకి రావడానికి రిహాబిలిటేషన్ సెంటర్ల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. శారీరక, మానసిక మరియు సామాజిక పరంగా రోగులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేందుకు ఇటువంటి కేంద్రాలు ఎంతో అవసరమని ఆయన తెలిపారు. ఉజ్జ్వల్ రికవరీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ద్వారా నాణ్యమైన, కరుణతో కూడిన



వైద్య సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

ముఖ్య అతిథులు ఈ కేంద్రం స్థాపన వెనుక ఉన్న సేవా దృక్పథాన్ని అభినందిస్తూ, సమాజానికి ఇది ఎంతో ఉపయోగకరంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైద్యులు, ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు, శ్రేయోభిలాషులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా బద్ది పోచమ్మ బోనాల వేడుకలు

వేములవాడ, ఆగస్టు 8: వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో బో నాల పండుగను విద్యార్థులు, ఉ పాధ్యాయు లు ఘనంగా నిర్వహించారు. ఈ నందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ బోనాలను మోసుకుంటూ, పోతురాజుల వేషధారణలో ఆకట్టుకున్నారు. డప్పు, సప్పు ల నాదాల మధ్య నంప్రదాయ నృత్యాలతో పండుగ వాతావరణాన్ని నృష్టించారు. తె లంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం



ముద్ర కోలా రాజు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించిన శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కోఆర్డినేటర్లు సునీల్ కుమార్, మమత, ప్రిన్సిపల్ సుదీ శీ కుమారి, డీన్ అంజయ్య, ఇన్ చార్జులు అరుణ్ కుమార్, ప్రవళిక, హరీష్, అరుణ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, పి ఈ టి లు సుధాకర్, మారుతి,కవిత, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 08 తెలంగాణ పవర్ : 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అధికారులను ఆదేశించారు.

ఈ మేరకు శనివారం మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా ఉన్నతాధికారులతో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ, ఆగస్టు 15న సింగరేణి ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ ప్రాంగణంలో పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, శోభాయమానంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిలకించేందుకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో వేడుకల ప్రాంగణాలను మామిడి తోరణాలు, త్రివర్ణ పతాకాలు మరియు ఇతర అలంకరణలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు.

అదేవిధంగా జాతీయ పతాకావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను సక్రమంగా పూర్తి చేయడంతో పాటు, కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగినన్ని కుర్చీలు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య ఏర్పాట్లు, విద్యుత్ ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని



జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అధికారులను ఆదేశించారు.

వేడుకల్లో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ పతాకావిష్కరణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షించి, ప్రతి విభాగం తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం డి. వెంకటరామారావు,ఏజెంట్ కొండాపురం ,వేణు మాధవ్,ఏజీఎం (వర్సనల్) ఎన్. రమేష్, ఏజీఎం (ఐఈ) సీహెచ్. రాంబాబు,ఏరియా ఇంజినీర్ వి. మదన్ నాయక్, డీజీఎం (సివిల్) జి. శివ ప్రసాద్ ,డీజీఎం (సర్వే) ఎల్. దయాకర్,డీజీఎం (ఏరియా వర్క్‌షాప్) టి. శ్రీకాంత్, డీవై.సీఎంఓ ఎం. జ్యోతిర్మయి,ఎంవీటీసీ మేనేజర్, నాగేశ్వరరావు , ఏఎస్ఓ రామన్ పాఠక్ , పర్యావరణ అధికారి జే. శ్రీనివాస్ రావు, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్ ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్ డీవై.పీఎం బి. శ్యామ్ ప్రసాద్ సీనియర్ పర్సనల్ అధికారులు కే. శ్రీనివాస్ వి. రామేశ్వర రావు తదితర ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు సమిష్టిగా కృషి చేద్దాం



నిజామాబాద్, ఆగస్టు 08 : నిజామాబాద్ ఉమ్మడి జిల్లా రైతాంగం ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమిష్టిగా కృషి చేద్దామని శాసన సభ్యులు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిలు విచ్చేయగా, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్చువల్ విధానం ద్వారా పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూరు, కౌలాస్ నాలా, పోచారం, రామడుగు తదితర జలాశయాలలో నీటి నిల్వల స్థితిగతులు, ఆయకట్టు పంటలకు సాగు నీటిని అందించే వెనులుబాటు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణకై రైతులకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ జలాశయాల ద్వారా యాసంగి పంటలకు సాగు నీటిని అందించేందుకు వీలుగా ప్రతీ సంవత్సరం రబీ సీజన్ సమయంలో జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశాలు జరిగేవని గుర్తు చేశారు. అయితే ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ సమయంలోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల ముసుముందు వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలు ఉన్నందున, వరి వంట విత్తుకున్న రైతులు నష్టపోకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇంకా పంట వేసుకోని రైతులు ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం నారు ముదిరిపోయినందున వరి నాట్లు వేసే సమయం మించిపోయిందని, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడమే మేలు చేకూరుస్తుందని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన తోడ్పాటును అందించాలని హితవు పలికారు. నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, ఇటీవల తుపాను ప్రభావంతో కొంతవరకు వర్షాలు కురిసినప్పటికీ, ఎల్ నినో కారణంగా ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 3.96 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట వేసుకున్నారని, కమాండ్, నాన్ కమాండ్ ఏరియాలలో ఇంకనూ 45 వేల ఎకరాల విస్తీర్ణంలో పంటలు విత్తుకోవాల్సి ఉన్నందున వరికి బదులుగా జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, పప్పుదినుసులు వంటి ఆరుతడి పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు ఎంతో శ్రేయస్కరం అయినందున వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. 80 టీ.ఎం.సీల పూర్తిస్థాయి సామర్థ్యం కలిగిన శ్రీరాంసాగర్ రిజర్వాయర్ లో గత ఏడాది తరహాలోనే ఈసారి కూడా ప్రస్తుత సమయానికి 40 టీ.ఎం.సీల నీరు నిలువ ఉండన్నారు. అయితే ఈ రిజర్వాయర్ ద్వారా ఆయకట్టు పంటలకు ఏ మేరకు సాగునీటిని విడుదల చేయాలన్నది ఈ నెలాఖరు (ఆగస్టు చివరి వారం)లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న శివం కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద నిజామాబాద్ జిల్లాలో లక్షా 15 వేల ఆయకట్టు విస్తీర్ణం ఉందని, ఈ జలాశయంలో ప్రస్తుతం 10.78 టీ.ఎం.సీల నీరు నిలువ ఉన్నందున ఆయకట్టుకు మూడు నుండి నాలుగు తడులు సాగు నీటిని అందించేందుకు అవకాశం ఉందన్నారు. రైతులు వేసుకున్న వరి పంటను పరిరక్షించేలా, ఇంకనూ పంటలు విత్తుకోని భూములలో ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతున్న సింగూర్ రిజర్వాయర్ కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా సామర్థ్యం మేరకు నీటిని నిలువ ఉంచే పరిస్థితి లేదని, ప్రస్తుతం నిలువ ఉన్న 4.140 టీ.ఎం.సీల నీటిని తాగునీటి సరఫరాకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇది 60 నుండి 90 రోజులకే సరిపోతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని వర్షాలు కురిసినట్లయితే మరో 4 టీ.ఎం.సీల వరకు వరద జలాలను సింగూర్ లో నిలువ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తద్వారా పై మూడు జిల్లాలకు వచ్చే ఐదారు నెలల వరకు తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఉండదని సూచించారు. భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందేలా జిల్లాలో జలసిరి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామని తెలిపారు. కాగా, కామారెడ్డి జిల్లాలోని కౌలాస్ నాల, పోచారం ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి మట్టాన్ని సంతరించుకున్నాయని, నిర్దేశిత ఆయకట్టుకు సాగు నీటిని అందించవచ్చని అన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ కూడా చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బోరుబావులపై ఆధారపడి అత్యధిక మంది రైతులు పంటలు సాగు చేస్తున్నందున భూగర్భ జలాలు వృద్ధి చెందేలా వాటర్ షెడ్ కార్యక్రమాలను విరివిగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ, నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతంగా ఉన్న ఆర్మూర్ నియోజకవర్గానికి కాలువలు సక్రమంగా లేక సాగర్ జలాలు అందడం లేదని అన్నారు. కేవలం గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 40వేల ఎకరాలకు సాగు నీరు అందుతోందని తెలిపారు. దీనివల్ల అనేకమంది బతుకుదెరువు కోసం గల్ఫ్ కు వలస వెళ్ళారని, ప్రస్తుతం సాగునీటిని అందించకపోతే మరింత మంది గల్ఫ్ బాట పట్టే ప్రమాదం ఉందన్నారు.

ఒంటరిగా బరిలోకి జనసేన



హైదరాబాద్, ఆగస్టు 8, (న్యూస్ పల్స్) తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. : తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. దీంతో సొంతంగానే పోటీకి సిద్ధమవుతోంది జనసేన తెలంగాణలో. త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికలతో పాటు ప్రభావం చూపించగలిగిన జిల్లాల్లో ప్రాదేశిక ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని చూస్తోంది జనసేన. అయితే ఉన్నట్టుండి బిజెపి జనసేన విషయంలో ఆ ఆలోచన చేయడానికి కారణం ఏంటనే ప్రశ్న వినిపిస్తోంది. భారత రాష్ట్ర సమితి తో బిజెపి పొత్తు ఉంటుందన్న పరిణామ క్రమంలోనే జనసేన ను దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అయితే జనసేన మాత్రం ఒంటరి పోరాటానికి అన్ని ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు సమాచారం.వాస్తవానికి ఏపీ మాదిరిగా తెలంగాణలో రాజకీయాలు ఉండవు. బిజెపి ఆది నుంచి స్వంతంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. కానీ ఆశించిన స్థాయిలో ఆ ప్రయత్నాలు ఏవి ఫలించడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావం చూపింది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ స్థానాలను తెచ్చుకుంది. అయితే బిజెపి అంతలా ప్రభావం చూపడానికి కారణం భారత రాష్ట్ర సమితి బలహీనం కావడమే. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడలేదు. ఆ బలాన్ని భర్తీ చేయాలంటే భారత రాష్ట్ర సమితితో పొత్తు బిజెపికి అవసరం. అదే సమయంలో పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలంటే ఓట్లతో పాటు సీట్లు పెంచుకోవడం భారత రాష్ట్ర సమితికి అవసరం. అందుకే ఆ రెండు పార్టీలు ఇప్పుడు పరస్పరం ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. జనసేన ను బిజెపి దూరం పెట్టడానికి అదే ప్రధాన కారణం అని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో మొన్న ఆ మధ్యన జరిగిన పరిణామాలు తెలియనివి కావు. పవన్ కళ్యాణ్ ను తెలంగాణ నుంచి కొంతమంది వ్యతిరేకించడం ప్రారంభించారు. దీంతో తెలంగాణలో కార్యకలాపాలు మొదలు పెట్టింది జనసేన. హైదరాబాదులో రాష్ట్ర కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అయితే బిజెపితో పొత్తు ఉంటుందన్న తరుణంలోనే ఇలా చేస్తున్నారని అంతా భావించారు. కానీ భారతీయ జనతా పార్టీ ఆలోచన మరోలా ఉంది. అందుకే జనసేనతో పొత్తు విషయంలో క్లారిటీ ఇచ్చింది. కానీ ఏపీ అనుభవాల నేపథ్యంలో ఒంటరిగా ముందు పోటీ చేసి.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఇతర పార్టీలు పొత్తుకు ముందుకు వస్తాయని.. అందుకే ఒంటరిగా ముందుకు వెళ్దామని జనసేన వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. సెటిలర్స్ అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు అభిమానులు ఉన్నచోట పార్టీని మరింత బలోపేతం చేయాలని జనసేన భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది.

బంగారు బోనం ఎత్తిన సినీ నటి, నిర్మాత నిహారిక కొణిదెల



హైదరాబాద్ నగరంలో బోనాల వేడుకలు వైభవంగా కొనసాగుతున్న వేళ, సినీ నటి, నిర్మాత నిహారిక కొణిదెల పాతబస్తీ మీరాలం మండిలోని శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి బంగారు బోనం ఎత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేదమంత్రాల నడుమ అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందిన అనంతరం ఆలయ అధికారులు ఆమెను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గాజుల అంజయ్య నిహారికకు ఆలయ చరిత్రతో పాటు ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాల విశిష్టత, సంప్రదాయాలను వివరించారు.అనంతరం నిహారిక మాట్లాడుతూ, ప్రధాన బోనాల రోజు షూటింగ్ ఉండటంతో ఆలయానికి రాలేకపోయానని, అందుకే అమ్మవారి దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. తాను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగినప్పటికీ బోనాల సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని వెళ్లే దృశ్యాలు ఎప్పుడూ తనను ఎంతో ఆకట్టుకునేవని చెప్పారు.కొద్ది రోజుల క్రితమే “నన్ను కూడా ఎవరైనా బోనాలకు తీసుకెళ్తే బాగుండేది” అని సరదాగా అన్నానని, ఆ కోరిక ఇంత త్వరగా నెరవేరడం అమ్మవారి అనుగ్రహమేనని పేర్కొన్నారు. “అమ్మవారు ఎంతో శక్తివంతమైన దేవత. ఈరోజు దర్శనం ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా జరిగింది. అమ్మవారి విగ్రహం దివ్య కాంతులతో అలరించింది. మరోసారి కూడా అమ్మవారి దర్శనం చేసుకునే అవకాశం కలగాలని కోరుకుంటున్నాను” అని నిహారిక అన్నారు.నిహారిక ఆలయానికి వచ్చిన విషయం తెలుసుకున్న భక్తులు ఆమెతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపగా, ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

భారత్, ఫ్రాన్స్ రఫేల్ డీల్

న్యూఢిల్లీ, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)భారత ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాల కొరతను తీర్చడానికి ఫ్రాన్స్ సమర్పించిన రూ.3.25 లక్షల కోట్ల రఫేల్ ప్రతిపాదన కేవలం కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు. ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ దిశగా ముఖ్యమైన అడుగు. 114 జెట్లలో 94 దేశంలోనే తయారు చేస్తామని ఫ్రాన్స్ తెలిపింది. దీంతో టెక్నాలజీ బదిలీ, స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలకు భారీ అవకాశాలు కలుగుతాయి.ఫ్రాన్స్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 114 రఫేల్ జెట్లలో 94 భారత్‌లోనే ఉత్పత్తి అవుతాయి. కొన్ని విమానాలు ఫ్లై?అవే కండిషన్‌లో వస్తాయి, మిగతావి దేశీయ భాగస్వామ్యంతో తయారవుతాయి. ఇది గత రఫేల్ ఒప్పందాలకు భిన్నంగా, మొట్టమొదటిసారి రఫేల్‌ను ఫ్రాన్స్ వెలుపల పెద్ద ఎత్తున తయారు చేయబోతోంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్లు, అవయోనిక్స్‌లో స్థానిక కంటెంట్ 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ స్వయంప్రతిపత్తి పెరుగుతుంది, భవిష్యత్తులో సొంత యుద్ధ విమానాల అభివృద్ధికి అనుభవం లభిస్తుంది. ఈ ఒప్పందం ఆమోదమైతే భారతీయ కంపెనీలకు దాదాపు రూ.1.6 లక్షల కోట్ల వ్యాపారం వస్తుందని అంచనా. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, లార్సెన్ ? టూబ్రో వంటి సంస్థలు ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ అసెంబ్లీ, అవయోనిక్స్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌లో పాల్గొంటాయి. ఫ్రెంచ్ కంపెనీలు డసాల్ట్, సఫ్రాన్, థేల్స్, ఎంబీడీఏ భారత భాగస్వాములతో కలిసి పనిచేస్తాయి. ఇది ఏరోస్పేస్ సప్లై చైన్‌ను బలోపేతం చేసి, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్థానిక ఆయుధాలు ఇంటిగ్రేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.రఫేల్ విడిభాగాల తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటవుతుంది. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో ఫ్యూజ్‌లేజ్(ఫ్యూస్‌లేజ్) తయారీ ఒప్పందాలు ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను ఏరోస్పేస్ హబ్‌గా మరింత బలపరుస్తుంది. ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌వో) సౌకర్యాలు కూడా ఇక్కడే రావచ్చు. దీనివల్ల తెలంగాణలో ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయి.భారత వాయుసేన స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఈ జెట్లు ముఖ్యం. ప్రస్తుతం ఉన్న 36 రఫేల్‌లకు జోడించి మొత్తం సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 4.5 జనరేషన్ మల్టీ?రోల్ సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు శత్రు దేశాలపై నిరోధక శక్తిని పెంచుతాయి. టెక్నాలజీ బదిలీతో భవిష్యత్తు న్వదేశీ విమానాల అభివృద్ధికి కూడా సహాయపడుతుంది.ప్రతిపాదనను రక్షణ శాఖ, వాయుసేన పరిశీలిస్తున్నాయి. ధర, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ స్థాయి, ఇండిజినస్ కంటెంట్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌పై చర్చలు జరుగుతాయి. ఒప్పందం ఆమోదమైతేనే పూర్తి ప్రయోజనాలు వస్తాయి. ఈ ప్రతిపాదన భారత్ రక్షణ సామర్థ్యం పెంచడంతోపాటు ఆర్థిక, పారిశ్రామిక లబ్ధిని కలిగిస్తుంది. భారత?ఫ్రాన్స్ రక్షణ సహకారంలో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

సర్పంచ్ భర్తను పరామర్శించిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి ,కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ సర్పంచ్ దీకోండ బాబాలక్ష్మి భర్త మధు అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ లోని వన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న చొప్పదండి నియోజకవర్గం మాజి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాస్పిటల్ కు వెళ్లి మధను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మధు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న చోప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ మెరుగైన వైద్యం అందించాలని డా'' మహేశ్వర్ రెడ్డికి సూచించారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, మధు త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.మాజి ఎమ్మెల్యే వెంట పలువురు బీ ఆర్ ఎస్ నాయకులు ఉన్నారు.

కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...



న్యూఢిల్లీ, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది.సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్టన్ల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది.అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు “సమయం వచ్చినప్పుడు చెబుతాను” అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి.ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న.సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

కేబినెట్ ప్రక్షాళన కు లైన్ క్లియర్

హైదరాబాద్, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయింది. అయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో కేబినెట్ కొలువుదీరలేదు. రెండు స్థానాలు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. వీటిని ఎప్పుడు భర్తీ చేస్తారా.. అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై అడుగులు ముందుకు పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కొంతకాలంగా క్యాబినెట్‌ను పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం ఒక సురక్షితమైన మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. అసంతృప్తులకు తావివ్వకుండా, కేవలం ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులను మాత్రమే భర్తీ చేసి ప్రస్తుతానికి రాజకీయాన్ని చల్లబరిచేందుకు ఏఐసీసీ సిద్ధమైంది. వారం, పది రోజుల్లో, అంటే ఈ నెల 14వ తేదీ తర్వాత చిన్నపాటి విస్తరణపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.జులైలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నేరుగా రంగంలోకి దిగి రాష్ట్రంలోని పలువురు మంత్రులతో వరుసగా వ్యక్తిగత సమావేశాలు నిర్వహించారు. శాఖల పనితీరు, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు, నాయకుల మధ్య సమన్వయం, వివిధ పోర్ట్‌ఫోలియోలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై ఆమె ఒక సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అధిష్టానం, ప్రస్తుత దశలో సమూల మార్పులు చేపడితే ఎదురయ్యే ముప్పును ముందే ఊహించింది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రుల రాజీనామాలు, తొలగింపుల వల్ల ఉత్పన్నమైన రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో అలాంటి అలజడులకు అస్కారం ఇవ్వకూడదని నిర్ణయానికొచ్చింది.హైకమాండ్ సూచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి రెండు కీలక సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఒకటి గిరిజన సామాజిక వర్గానికి, మరొకటి దాన్ని ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యం లేని రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఎస్టీ (లంబాడా) రేసులో గిరిజన సామాజిక వర్గానికి చెందిన రామచంద్ర నాయక్, బాలు నాయక్ లేదా దేవరకొండ ఎమ్మెల్యే పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇక రెడ్డి సామాజిక వర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి వంటి సీనియర్లు తమ శాయశక్తులా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరితో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా చర్చల్లో ఉంది. అసెంబ్లీ ఎన్నికల ముందే తనకు క్యాబినెట్‌లో చోటు కల్పిస్తామని అధిష్టానం హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన వర్గీయులు గుర్తు చేస్తున్నారు.ప్రస్తుత విస్తరణలో భారీగా పోర్ట్‌ఫోలియోలు మారుతాయా లేదా అనే అంశం పక్కన పెడితే, కొన్ని కీలక శాఖల్లో చిన్నపాటి మార్పులు ఉండే అవకాశం ఉందనే సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే, మంత్రిపదవులు ఆశిస్తున్న నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, పదవులు దక్కని వారి నుంచి ఎలాంటి ప్రతిఘటన లేదా బహిరంగ అసంతృప్తి రాకుండా చూడటమే రేవంత్ రెడ్డికి, హైకమాండ్‌కు ఉన్న అతిపెద్ద సవాలు. ఇందుకోసం తుది ప్రకటనకు ముందే ఆశావాహులతో వ్యక్తిగతంగా చర్చలు జరిపి, వారికి ఇతర నామినేటెడ్ లేదా పార్టీ పదవుల హామీలతో బుజ్జగించే వ్యూహాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తోంది.మొత్తానికి, పెద్ద ఎత్తున రీషఫుల్ చేసి లేనిపోని చిక్కులు కొనితెచ్చుకోవడం కంటే, రెండు ఖాళీలను భర్తీ చేస్తూ సామాజిక సమతుల్యతను కాపాడుకోవడమే ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ కాంగ్రెస్‌కు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందని భావిస్తున్నారు. ఈ నెల 14 తర్వాత వచ్చే ఆ కీలక ప్రకటనతో కాంగ్రెస్ అంతర్గత రాజకీయ సమీకరణాలు ఏ మలుపు తిరుగుతాయో వేచి చూడాలి.

తమిళ బడ్జెట్ లో విజయ్ హామీలకు నిధులు

చెన్నై, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు. అతుకుల బొంత. ఎప్పుడైనా కూలిపోవచ్చు. మద్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి. నమ్మకాన్ని కోల్పోవద్దు..ఇవి ఇటీవల డీఎంకే అధినేత స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు. అంతేకాదు విజయ్ గవర్నమెంట్ మీద.. గవర్నెన్స్ మీద ఆయన విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి కనీసం మూడు నెలలు కూడా పూర్తికాకముందే.. కొత్త ప్రభుత్వానికి ఆరు నెలలపాటు హనీమూన్ పీరియడ్ అనేది ఉంటుందని తెలిసి కూడా.. స్టాలిన్ విమర్శలు చేయడం మొదలుపెట్టారు. విజయ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించడం ప్రారంభించారు.ఎన్నికల సమయంలో నూతన వధువులకు 8 గ్రాముల బంగారం? పట్టు చీరలు.. ప్రభుత్వ వైద్యశాలలో జన్మించిన పిల్లలకు బంగారు ఉంగరాలు.. కాలేజీ విద్యార్థులకు లాప్టాప్ లు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. వంటి హామీలను విజయ్ ప్రకటించారు. ఈ హామీలు అమలు చేయాలని.. నూతన వధువులకు బంగారం.. పట్టు చీరలు ఇచ్చే అవకాశం లేదని.. ప్రభుత్వం వీటిని నిలబెట్టుకోలేదని.. అనేక సందర్భాలలో స్టాలిన్ విమర్శించడం ప్రారంభించారు. ఈ విమర్శలకు టీవీకే నేతలు పెద్దగా స్పందించలేదు. విజయ్ కూడా రియాక్ట్ కాలేదు.టైం చూసి దెబ్బ కొట్టడం విజయ్ కి అలవాటు. సినిమాల్లో అయితే విలన్ ను ఎలా కొడతాడో.. రియల్ లైఫ్ లో కూడా తన ప్రత్యర్థిని కూడా అలాగే విజయ్ దెబ్బ కొట్టాడు. తమిళనాడు బడ్జెట్లో విజయ్ తన తిరుగులేని వ్యూహాత్మకత విధానాన్ని ప్రదర్శించాడు.. ప్రతిపక్షాలు అంచనా వేయలేని విధంగా తమిళ ప్రజల మీద వరాల జల్లు కురిపించాడు. నూతన వధువులకు 8 గ్రాముల బంగారం.. పట్టుచీర అందించడానికి 912 కోట్లు కేటాయించింది విజయ్ ప్రభుత్వం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టే పిల్లలకు బంగారు ఉంగరం ఇచ్చేందుకు 560 కోట్ల కేటాయించింది. కాలేజీలలో చదువుకునే విద్యార్థులకు ల్యాప్టాప్లు అందించడానికి 2000 కోట్లు కేటాయించింది. తొలిసారి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు రాయితీ 25వేల నుంచి 35వేలకు పెంచింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేదలకు అందిస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించి కూడా నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.ఈ హామీల మీద విజయ్ ప్రభుత్వాన్ని పదేపదే డిఎంకె ప్రశ్నిస్తోంది. వీటిని అమలు చేయాలని కోరుతూ ఉంది. దీనిపై విజయ్ ఇంతవరకు మాట్లాడలేదు. చివరికి బడ్జెట్లో తన కేటాయింపుల ద్వారా డీఎంకే చేస్తున్న ఆరోపణలకు సాలిడ్ సమాధానం ఇచ్చారు. అంతేకాదు తాను మాట ఇస్తే మడమతిప్పే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపుల నేపథ్యంలో టీవీకే నేతలు సోషల్ మీడియాలో ఎదురు దాడి మొదలు పెట్టారు. డీఎంకే నేతలను లక్ష్యంగా చేసుకొని.. ఇప్పుడేమంటారని ప్రశ్నిస్తున్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్యయాత్ర'

సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా



బూర్గంపహాడ్, ఆగస్టు 08 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర సాగుతుందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే.సాబీర్ పాషా తెలిపారు. శనివారం బూర్గంపహాడ్ మండల కేంద్రానికి చేరుకున్న యాత్రలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ దేశంలో ప్రజా సమస్యలపై చైతన్యం కల్పించి మార్పు తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా యాత్రలో అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రజలను దోచుకునే పాలన మారాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత, విద్యార్థులు చేపట్టిన ఉద్యమమే ప్రజా చైతన్యానికి నిదర్శనమన్నారు.మండలంలో ప్రతి ఏడాది గోదావరి వరదలతో లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండలాన్ని ముంపు నుంచి శాశ్వతంగా రక్షించేందుకు ఎత్తైన ప్రదేశాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించి గిరిజన ఆదివాసీ రైతులకు హక్కులు కల్పించాలని, పోడు రైతులపై అటవీశాఖ అధికారులు నమోదు చేస్తున్న కేసులను ఉపసంహరించి రక్షణ కల్పించాలన్నారు. ఈ యాత్రలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి, ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మికుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డా), జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి సబ్బా నాగేశ్వరరావు, నలజాల సత్యనారాయణ, మల్లికార్జున్, చారి, ముదిగొండ బాలకృష్ణ, సీనియర్ నాయకులు బర్ల వెంకటేశ్వర్లు, సిద్ధార్థ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం విజయ్‌ది

డ్రామా.. ఎంపీల మీటింగ్‌కు హాజరుకాబోం : కనిమొళి



తమిళనాడు లో నియోజకవర్గాల పునర్విభజన పై ముఖ్యమంత్రి విజయ్ నిర్వహిస్తున్న ఎంపీల సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు డీఎంకే ప్రకటించింది. డీలిమిటేషన్ అంశంపై ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు తమ స్పష్టమైన వైఖరిని తెలియజేశాయని, అలాంటప్పుడు టీవీకే ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ భేటీ కేవలం ఒక 'రాజకీయ డ్రామా' మాత్రమే అని డీఎంకే సీనియర్ నాయకురాలు, ఎంపీ కనిమొళి విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే డీలిమిటేషన్ వల్ల జనాభా నియంత్రణ పాటించిన తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్ల సంఖ్య తగ్గి తీవ్ర అన్యాయం జరుగుతుందనే ఆందోళనపై విజయ్ రాష్ట్ర ఎంపీలతో చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. అయితే డీలిమిటేషన్‌పై గతంలోనే స్పష్టమైన తీర్మానాలు ఉన్నాయని, దీనికంటే కావేరి నీటి విడుదల, మేకెదాటు ప్రాజెక్టుపై తమిళనాడు వైఖరిని బలంగా వినిపించేందుకు ఆల్-పార్టీ సమావేశం పెట్టడమే తక్షణ అవసరమని డీఎంకే నేతలు వ్యాఖ్యానించారు.

పోలీస్ నిబంధనలు బేఖాతర్ నో పార్కింగ్

బోర్డుల వద్ద నిలిపిన వాహనాలు

బూర్గంపహాడ్, ఆగస్టు 08 : పోలీస్ నిబంధనలను వాహనదారులు బేఖాతర్ చేస్తున్నారు. పారిశ్రామిక కారిడార్‌గా ఉన్న బూర్గంపహాడ్ మండల పరిధిలోని లక్ష్మీపురంలో లారీ యార్డు వద్ద వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలుపుతూ నిబంధనలను అతిక్రమించడంపై శుక్రవారం బూర్గంపహాడ్ పోలీసులు యార్డు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి 24 గంటలు గడవక ముందే యార్డుకు వచ్చే లారీలను నో పార్కింగ్ బోర్డులు ఉన్నా అక్కడే నిలిపివేసి పోలీసు అధికారుల హెచ్చరికలను బేఖాతర్ చేశారు. ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా ఈ ప్రాంతంలో 10 వరకు నో పార్కింగ్ బోర్డులను పోలీసులు ఏర్పాటు చేసినప్పటికీ, యార్డుకు వచ్చి పోయే లారీలు రోడ్డుకు పక్కనే నో పార్కింగ్ బోర్డుల వద్దే నిలపడం ఏంటని వాహనదారులు మండిపడుతున్నారు. లారీలను నిబంధనలకు విరుద్ధంగా అడ్డదిడ్డంగా నిలిపే వారిపై, లారీ యార్డు నిర్వాహకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు సీపీఆర్‌పై అవగాహన



రుద్రంపూర్, ఆగస్టు 08 : గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి అత్యవసర సమయంలో సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ అన్నారు. జీ.ఎం ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహనతో పాటు శిక్షణ కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాథమిక సహాయం అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తిని గుర్తించడం, స్పందన, శ్వాసను పరిశీలించడం, అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం, ఛాతీపై కంప్రెషన్స్ చేయడం, అవసరమైన సందర్భాల్లో ఏఈడీ (ఐఆఅ) పరికరాన్ని వినియోగించడం వంటి అంశాలపై శిక్షకులు అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యోగులతో ప్రాక్టికల్‌గా సీపీఆర్ చేయించి, సరైన విధానాన్ని ఎంఆర్ఎస్ సిబ్బంది వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకమని, వైద్య సిబ్బంది చేరుకునేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని శిక్షకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరువతి, ఇన్‌చార్జ్ ఎంఆర్ఎస్ అనంతరామయ్య, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డీవైపీఎం హరీష్, సీనియర్ పీఓ మురళి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ సి.హెచ్. సాగర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ కె. సౌజన్యతో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి కరెంట్ సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం ఘోర వైఫల్యం

నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

హాలియా, ఆగస్టు 08 : వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల కరెంటు అందిస్తే, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 12 గంటలు కూడా సక్రమంగా రైతులకు కరెంటు సరఫరా చేయడం లేదన్నారు. ఇచ్చే కరెంటు కూడా 6 గంటలకు 6 గంటలకు మధ్య బ్రేక్ పెడుతున్నారని రైతులకు మడి కూడా తడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 12 గంటలు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. గంటకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో అధికారులు దిగివచ్చి రైతులు కోరుకున్న విధంగా వ్యవసాయానికి 12 గంటల పాటు నిర్విరామంగా కరెంటు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ రాస్తారోకో విరమించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రాకతోనే రాష్ట్రానికి అరిష్టం పట్టుకుంది, అందుకే రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయి. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రజలకు అలవిగానీ హామీలను ఇచ్చి దేవుళ్లపై ఒట్టేసి ప్రజలను మోసగించడం జరిగిందని, అందుకే రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాశి వెళ్లి గంగా నదిలో పుణ్య స్నానం చేసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే నాగార్జునసాగర్ నియోజకవర్గానికి వచ్చి వర్షం కోసం నిర్వహించే వరుణ యాగంలో పాల్గొనాలన్నారు.రాష్ట్రంలో గోదావరి జలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ కాళేశ్వరం పంపులను ఆన్ చేయకుండా రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతూ సీఎం రేవంత్ రెడ్డి రైతులను బలి చేస్తున్నారన్నారు. మిగులు జలాల పేరుతో సీఎం రేవంత్ గోదావరి జలాలను ఆంధ్రాకు అప్పనంగా అందజేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం పంపులను ఆన్ చేసి గోదావరి జిల్లాలను ఎత్తిపోస్తే తెలంగాణలో సగభాగం సస్యశ్యామలవుతుందన్నారు. గోదావరిలో నీళ్లు ఉన్నా కరెంట్ ఇవ్వకపోవడం వల్లే రాష్ట్రంలో రైతులు దుర్భిక్ష పరిస్థితి ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళనలు.. సానుకూలంగా ప్రభుత్వ రెండో దఫా చర్చలు

రాంచీ: ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ ఘటనలకు నిరసనగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు జార్ఖండ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ఓసారి వారితో చర్చలు జరపగా.. తాజాగా శనివారం రెండో దఫా చర్చలు నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలు సహా పలు అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. చర్చల అనంతరం మాట్లాడిన విద్యార్థులు.. ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. అయితే, తమ డిమాండ్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురుచూస్తున్నట్లు నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులు పేర్కొన్నారు.కాగా, జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ ఘటనలకు నిరసనగా విద్యార్థులు 15 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరసన దీక్షలు, ధర్నాలు కొనసాగుతున్నాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏఖూఅ), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (మీూఅ-అఉఒ) నిర్వహించిన పలు పోటీ పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఈ సందర్భంగా వారు ఆరోపిస్తున్నారు. 14వ జేపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష పేపర్లతో పాటు అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు లీక్ కావడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నమోదైన పేపర్ లీక్ కేసులపై సీఐడీ విచారణ సక్రమంగా జరగడం లేదని, నామమాత్రంగానే దర్యాప్తు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఈ సందర్భంగా 14వ జేపీఎస్సీ కంబైన్డ్ ప్రిలిమినరీ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, గత ఏడేళ్లుగా జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ ద్వారా నిర్వహించిన అన్ని నియామక పరీక్షలపై సీబీఐ లేదా ఈడీ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు. పరీక్షా విధానంలో మరింత పారదర్శకత తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అందుకు ఓఎంఆర్ షీట్లలో ఐదో ఆప్షన్‌గా 'ఔనీబి ంబిబివఎజూబివట' అనే ఎంపికను చేర్చాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.



శిరోమణి అకాలీ దళ్ సంచలన నిర్ణయం.. డీలిమిటేషన్‌కు మద్దతు ప్రకటిస్తూ..



ఢిల్లీ: పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీని ఇటీవల కలిసిన శిరోమణి అకాలీ దళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ కీలక ప్రకటన చేశారు. తమ పార్టీ డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించే నిష్పక్షపాత, న్యాయమైన నియోజకవర్గాల పునర్విభజన జరగాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అన్ని రాష్ట్రాల్లో సీట్లను ఏకరీతిగా 50 శాతం పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను సుఖ్‌బీర్ సింగ్ బాదల్ సమర్థించారుమహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను తక్షణమే చేపట్టాలని శిరోమణి అకాలీ దళ్ అధ్యక్షుడు పేర్కొన్నారు. తమ పార్టీ సిక్కుల బోధనల నుంచి స్ఫూర్తి పొందిందని.. మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం సిక్కు గురువులు పోరాడారని చెప్పారు. శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ సభలో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఇప్పటికే తమ పార్టీ అందరికీ ఆదర్శంగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెడతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో ప్రధాని మోదీతో భేటీ అనంతరం డీలిమిటేషన్‌కు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ మద్దతు ప్రకటించడంతో రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. కాగా, లోక్‌సభలో శిరోమణి అకాలీ దళ్ పార్టీకి ఒక స్థానం ఉంది.

డీప్‌ఫేక్ వీడియోలపై కేంద్రం కన్నెర్ర..

చర్యలు తీసుకోవాలని మెటాకు ఆదేశం..



న్యూఢిల్లీ ,సోషల్ మీడియాలో డీప్‌ఫేక్ కంటెంట్ వీడియోల వ్యాప్తిపై కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరిస్తోంది. డీప్‌ఫేక్ కంటెంట్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని మెటాను కేంద్రం ఆదేశించింది. సోషల్ మీడియా వేదికల్లో ఉండే కంటెంట్‌కు ఆయా సంస్థలే బాధ్యత వహించాలని పేర్కొంది. అలాగే భారత చట్టాల ప్రకారం మెటా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తోందా లేదా అనే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది ఇటీవల కేంద్రం, మెటా ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల్లో డీప్‌ఫేక్‌లు, బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్, నకిలీ ఖాతాలు వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది. హానికరమైన కంటెంట్‌ను గుర్తించిన తర్వాత కూడా అది సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాప్తి చెందడంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఏఐ సాయంతో రూపొందించే నకిలీ వీడియోలు, చిత్రాలు, ఆడియోలు వాటి దుర్వినియోగంపై ప్రభుత్వం ఆందోళన చెందుతోందిముఖ్యంగా ప్రజలను తప్పుదోవ పట్టించే, వ్యక్తుల ప్రతిష్ఠకు నష్టం కలిగించే లేదా ఇతర హానికరమైన ప్రయోజనాలకు ఉపయోగించే కంటెంట్‌ను అరికట్టాల్సిన అవసరాన్ని మెటాకు కేంద్రం స్పష్టం చేసింది ఇక, మెటాతో జరిగిన చర్చల అనంతరం తదుపరి చర్యలు ఏ విధంగా ఉండాలన్న దానిపై కేంద్ర ప్రభుత్వం న్యాయపరమైన అభిప్రాయం కోసం ఎదురుచూస్తోంది. న్యాయ సలహా అందిన తర్వాత మెటాపై తదుపరి చర్యల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఆగ్రాలో రహదారిపై భారీ గుంత.. అందరూ చూస్తుండగానే..

ఆగ్రా: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇటీవల రహదారులు కుంగిపోవడం, పగుళ్లు ఏర్పడటం వంటి సమస్యలు ప్రయాణికులను తీవ్రంగా వేధిస్తున్నాయి. మొన్న రూ.4,200 కోట్లతో నిర్మించిన లక్నో-కాన్పూర్ ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన కొన్ని రోజులకే పగుళ్లు ఏర్పడగా.. తాజాగా ఆగ్రాలోని కమలా నగర్ ప్రాంతంలో రోడ్డు ఒక్కసారిగా కుంగిపోయింది. రోడ్డు కుంగిపోయి ఏకంగా పెద్ద గుంతే ఏర్పడింది. ప్రమాద సమయంలో ఆ రహదారిపై వాహనాలు వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటనాస్థలికి చేరుకుని అటువైపుగా వాహనాలు వెళ్లకుండా నియంత్రించారు.అయితే, రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడిన కమలా నగర్ ప్రాంతానికి సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు నితిన్ కోహ్లీ చేరుకున్నారు. తన అనుచరులతో కలిసి అక్కడికి వచ్చిన ఆయన.. నిచ్చెన సహాయంతో గుంతలోకి దిగారు. అక్కడే నిలబడి ప్రభుత్వం, అధికారులపై విమర్శలు గుప్పించారు. వర్షాకాలంలో పదేపదే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కోహ్లీ మండిపడ్డారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల్లో తీవ్ర అవినీతి జరుగుతోందని, అందుకే ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని కోహ్లీ ఆరోపించారు.ఆగ్రా నగరాన్ని గుంతల నగరంగా మార్చేస్తున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రహదారిపై ఏర్పడిన గుంతను పాతాళానికి దారిగా అభివర్ణించారు. ఇలాంటి ప్రమాదాలు ప్రజల భద్రతకు ముప్పు కలిగిస్తాయని, అభివృద్ధి పనుల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నితిన్ కోహ్లీ డిమాండ్ చేశారు.



మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

విజయవాడ, ఆగస్టు 8, వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహంవచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని


ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన జెన్ జీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామాచేయించింది కూడా. ఈ ఉద్యమంతో రాజకీయాల్లో జెన్ జీ పాత్ర ఏమిటనే దానిపై పొలిటికల్ పార్టీలకు ఓ క్లారిటీ వచ్చింది. దీంతో అన్ని పార్టీలు కూడాజెన్ జీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి.ఈ క్రమంలోనే ఏపీలోని యువతరాన్ని తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. యువత, విద్యార్థుల సమస్యలను లేవనెత్తుతోంది. నీట్ తరహాలోనే ఏపీలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. జెన్ జీ ఉద్యమం ముందు వరకూ డీఎస్సీలో అక్రమాలపై వైసీపీ సాగించిన పోరాటం.. ప్రధాన్ రాజీనామా అనంతరం దేశవ్యాప్తంగా మారిన పరిస్థితుల కారణంగా కొత్త రూపు తీసుకుంది. వైసీపీ చేసే నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలోనూ జెన్ జీ పేరును వైసీపీ నేతలు ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల పొగాకు రైతులను పరామర్శించేందుకు తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లిలో పర్యటించారు.జగన్ పర్యటనకు జెన్ జీల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని... యువతరం పెద్ద సంఖ్యలో జగన్ కార్యక్రమానికి హాజరయ్యారని వైసీపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇప్పుడు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షల వద్ద జెన్ జీ ప్రస్తావన తేవడం మారిన వైసీపీ స్ట్రాటజీకి నిదర్శనమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

వచ్చే జనాలు ఓట్లుగా మారుతాయా

కాకినాడ, ఆగస్టు 8, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.మరో మెగా డీఎస్సీ.. ఎప్పుడంటే? బయటకు వస్తే చాలు... గత పథ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థి ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామీ అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు.

ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు.కొన్నిచోట్ల వైసీపీ పోస్టర్లపై జెన్జీ వార్ అంటూ ముద్రిస్తుండటం గమనార్హం. తాజాగా వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌తో వైసీపీ వ్యూహం మారిందనే క్లారిటీ వచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.డీఎస్సీ అక్రమాలపై విజయవాడలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే, అతని అనుచరులు దాడి చేసి ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు.పోలీసుల కళ్లముందే, వారి సమక్షంలోనే టెంట్లు లాగిపడేశారని.. మా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు యువతను లక్ష్యంగా చేసుకుని రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని జగన్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేశారన్న జగన్.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని ఆరోపించారు.దీక్షా శిబిరాలను ధ్వంసం చేసి, నిరసనకారులను అరెస్టు చేసి, నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరని.. ఆంధ్రప్రదేశ్ గొంతును మూయలేరంటూ జగన్ ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జగన్ ట్వీట్ 2029 ఎన్నికలకు వైసీపీ స్ట్రాటజీని తెలియజేస్తోందని పొలిటికల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ నిరసనలు, ఆందోళన కార్యక్రమాల వైపు యువతరాన్ని ఆకర్షించి, వారి భాగస్వామ్యులను చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో విజయధంకా మోగించాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా



నెల్లూరు, ఆగస్టు 8, ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. 2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో?.విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్-జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్-జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో?సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్, డిసెంబర్ నెలలో పరీక్షలు.. విద్యాశాఖ ప్రకటన

విజయవాడ, ఆగస్టు 8, ఏపీలోని నిరుద్యోగ యువతకు గుడ్ న్యూస్. అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ నెలలో నోటిఫికేషన్ విడుదల, డిసెంబర్ నెలలో పరీక్షలు ఉంటాయని ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమిమ్ అన్సారియా తెలిపారు. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు శుక్రవారం మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థులు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుభవార్త చెప్పింది. వచ్చే అక్టోబర్ నెలలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమిమ్ అన్సారియా తెలిపారు. డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణల మీద ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మరోసారి వివరణ ఇచ్చింది. అమరావతి సచివాలయంలో విలేకర్లతో మాట్లాడిన తమిమ్ అన్సారియా.. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎస్సీ 2025 ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశామని.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో అత్యంత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించామన్నారు. అయినప్పటికీ డీఎస్సీ 2025పై నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని.. ఆందోళనకు గురికావద్దని సూచించారు.మరోవైపు 2025 డీఎస్సీపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఇప్పటి వరకూ మూడుసార్లు వివరణ ఇచ్చామని.. అయినా కూడా దుష్ప్రచారం చేస్తుంటే మరోసారి క్లారిటీ ఇస్తున్నట్లు వివరించారు. హారిజాంటల్ రిజర్వేషన్ ప్రకారమే అర్హులకే పోస్టులు దక్కాయన్న తమిమ్ అన్సారియా.. ఏవైనా అనుమానాలు ఉంటే తమ వద్దకు రావాలని సూచించారు. 12 పద్ధతులను అనుసరించి డీఎస్సీ నిర్వహించామని.. డీఎస్సీ మెరిట్, సెలక్షన్ లిస్టును ఆన్ లైన్‌లో ఎప్పుడైనా చూసుకునే అవకాశం ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆందోళనకు గురికావొద్దని.. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తమిమ్ అన్సారియా తెలిపారు. ఉద్యోగాలు రాని అభ్యర్థులు.. ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మకుండా వచ్చే డీఎస్సీపై దృష్టిపెట్టాలని తమిమ్ అన్సారియా సూచించారు.మరోవైపు స్పోర్ట్స్ కోటా టీచర్ల నియామకాలపై ఏపీ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ భరణి స్పందించారు. అన్ని ఫెడరేషన్లు, స్పోర్ట్స్ అసోసియేషన్లు నుంచి పూర్తి వివరాలు సేకరించామని, ప్రతి అభ్యర్థి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించామని వివరించారు. ఆ తర్వాతే ప్రిలిమినరీ ప్రాధాన్యత జాబితాను రూపొందించి విద్యాశాఖకు పంపినట్లు భరణి క్లారిటీ ఇచ్చారు. మరోవైపు డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు కూడా చేపట్టింది

వైజాగ్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్టే.. ఆ 35 కూడళ్లలో సరికొత్తగా!

విశాఖపట్టణం, ఆగస్టు 8, వైజాగ్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖ కలెక్టర్ అభిషిక్తి కిశోర్ ఆదేశాల మేరకు ఇటీవల ఓ సర్వే కూడా నిర్వహించారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద అభివృద్ధి పనులు చేసి ట్రాఫిక్ సమస్యను రూపుమాపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత వైజాగ్ ప్రాంతం అభివృద్ధి బాట పట్టింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా ఈ ప్రాంతానికి రావడానికే మొగ్గు చూపుతున్నాయి. ఎయిర్‌పోర్ట్, నౌకాశ్రయం, స్టీల్‌ప్లాంట్ ఇలా అభివృద్ధికి కీలక మార్గాలన్నీ ఇక్కడే ఉండటంతో జనాభా పెరగడం, ట్రాఫిక్ సమస్య కూడా రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. దాతో ట్రాఫిక్ రద్దీకి జీవీఎంసీ చర్యలు చేపట్టింది.విశాఖ కలెక్టర్ అభిషిక్తి కిశోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో జాతీయ రహదారిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు, వాహనాల సంఖ్య, తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ ఇటీవల సర్వే చేపట్టింది. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వచ్చారు.ఈ 35 కూడళ్లలో ప్రైవేట్ ఏజెన్సీతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి జీవీఎంసీ సిద్ధమైంది. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు. ఇక్కడ ప్రధానంగా సర్వీసు రహదారి ఏర్పాటు చేయడం.. ప్రస్తుతం ఉన్న ఫ్రీ లెఫ్టులను మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.వెంకోజీపాలెం వద్ద హెచ్‌బీ కాలనీకి వెళ్లే రహదారి విస్తరించడం, విశాఖ వ్యాలీ కూడలి వద్ద మరో సర్వీసు రహదారి నిర్మించడం, ఎండాడ వద్ద సర్వీసు రహదారి అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలు అధికారులు తీసుకున్నారు. ఈ పనులను చేయడానికి త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఈ ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సమావేశం కూడా నిర్వహించారు.జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసుల బృందం సర్వే ఆధారంగా ఒక అవగాహనకు వచ్చి అభివృద్ధి పనులు చేయట్టాలని నిర్ణయించారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టనున్నారు. మొదటి దశలో 11 కూడళ్లు ఎంపిక చేస్తారు.. ఆ తర్వాత మరో 24 కూడళ్లకు పనులను విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులన్నీ రెండు నెలల వ్యవధిలోనే పూర్తి చేయాలని భావిస్తున్నారు.

ఫీజుల ఒత్తిడితో విద్యార్థి ఆత్మహత్య


కాకినాడ,ళాశాల సిబ్బంది వ్యాఖ్యలతో తీవ్రమనస్థాపానికి గురైన ఓ వింటర్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు, కాకినాడ జగన్నాధపురం లోని జేరామారావుపేట సమ్మెట వారి వీధికి చెందిన పైల రాంబాబు జ్యోతి దంపతుల రెండో కుమారుడు పైల అరవింద్ 15 సంవత్సరాలు ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నడు, శుక్రవారం అరవింద్ అతని తండ్రి ఇద్దరు కళాశాలకు వెళ్ళినప్పుడు, చాలామంది సెకండ్ టర్మ్ కూడా కట్టేశారని మీరు ఇంకా మొదటి టర్మ్ కట్టలేదని సిబ్బంది నలుగురు ముందు అనడంతో, వారు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు.శుక్రవారం రాత్రి ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో విద్యార్థి అరవింద్ ఫ్యాన్ కి ఊరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై కళాశాల ఉపాధ్యాయులు మరియు మీద కఠినంగా శిక్షించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు బంధువులు విద్యార్థులు కోరుతున్నారు.

మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు ఓటుకు ఈవీఎంలా.. బ్యాలట్ బాక్సులా?

ఒంగోలు ఆగస్టు 8,స్థానిక సంస్థల ఎన్నికల నగారా అతి త్వరలో మోగనుంది. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో సమావేశమయ్యారు. 2021లో జరిగిన తీరును, ఇప్పుడు జరగనున్న విధానంపై చర్చించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? లేక ఈవీఎంలు వాడాలా? అన్న విషయంపై కూడా అధికారులు చర్చించారు. ఎన్నికల తేదీ వచ్చేలోపే అంతా సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ క్షణమైనా మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నగారా మోగొచ్చని.. అధికారులు సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అలర్ట్ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటి పరిష్కరానికి తీసుకుంటున్న చర్యలపై పురపాలక, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు వినియోగించాలా, ఈవీఎంలు వాడాలా అనే అంశంపై కూడా చర్చించారు.రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. కొన్ని చోట్ల కోర్టు కేసులు ఉన్నందున వాటిని పరిష్కరించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చీఫ్ సెక్రటరీ వివరించారు. పెండింగ్‌లో 23 కోర్టు కేసులు ఉంటే వాటిల్లో నాలుగు పరిష్కారమయ్యాయి అని తెలిపారు.ఇక పంచాయతీల విషయానికి వస్తే రాష్ట్రంలో మొత్తం 13,359 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2021లో 354 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఒక ప్రజంటేషన్ కూడా ఇచ్చారు. పురపాలకశాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల తుది జాబితా ప్రచురణ, పోలీస్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపైనా సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు.ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? ఈవీఎంలు వాడాలా? అనే అంశంపై కూడా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో చర్చించారు. జిల్లాల వారీగా ఎన్ని బ్యాలట్ బాక్సులు ఉన్నాయి, ఎన్ని ఈవీఎంలు ఉన్నాయి

స్పోర్ట్స్ న్యూస్

ఇప్పట్లో మైదానంలోకి దిగడం కష్టమే.. బుమ్రా, హార్దిక్ గాయాలపై అప్‌డేట్!



శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు గాయాల బెడద తప్పడం లేదు. భారత జట్టుకు ఇప్పుడు ఆడుతున్నవారు, భవిష్యత్తులో ఎంపికయ్యే అవకాశం ఉన్న 13 మంది ప్లేయర్లు ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందుతున్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. అయితే ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో గాయపడిన స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, మరో ప్లేయర్ హార్దిక్ పాండ్య గాయాలపై తాజాగా సమాచారం బయటకు వచ్చింది.బుమ్రా ఎడమ మోకాలిలో వాపుతో ఇబ్బంది పడుతున్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జాగింగ్, ఒక కాలితో చేసే వ్యాయామాల సమయంలో అతడికి అసౌకర్యం ఎదురైనట్లు తెలుస్తోంది. దీంతో బుమ్రా తిరిగి మైదానంలోకి వచ్చే విషయంపై ఇప్పుడే క్లారిటీ వచ్చే అవకాశం లేదు. బుమ్రా కోలుకోవడానికి ఇంకొంత సమయం పట్టొచ్చని తెలుస్తోంది. మరోవైపు హార్దిక్ పాండ్యకు కూడా రికవరీ సమయంలో కొత్త సమస్య ఎదురైనట్లు సమాచారం. తొడ కండరాల గాయం నుంచి కోలుకుంటున్న హార్దిక్.. పూర్తిస్థాయిలో బౌలింగ్ ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత మోకాలి నొప్పి వచ్చింది. వైద్య పరీక్షల్లో పెద్ద సమస్యగా కనిపించకపోయినా.. ముందు జాగ్రత్తగా పరుగెత్తడం, బౌలింగ్ చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. అయితే చికిత్సకు హార్దిక్ బాగా స్పందిస్తున్నాడని వైద్యులు తెలిపారు. త్వరలోనే తన బౌలింగ్ భారాన్ని కూడా క్రమంగా పెంచుకునే అవకాశం ఉందని పేర్కొంది.ఇక టీమిండియా టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కూడా గాయం కలకలం రేపింది. శ్రీలంక ఏతో జరుగుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌కు ముందు గురువారం ప్రాక్టీస్‌లో కుడి చేతి బొటన వేలికి గాయం అయింది. దీంతో గిల్ స్థానంలో కేఎల్ రాహుల్ జట్టును నడిపిస్తున్నాడు. రెండో రోజు మైదానంలోకి దిగుతాడని భావించినా.. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల గిల్ ఆడట్లేదు. ఇప్పటికే జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి శ్రీలంక పర్యటనకు దూరమయ్యారు. వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్ ఫిట్‌నెస్‌పైనా అనుమానాలు కొనసాగుతున్నాయి. దీంతో శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు ముందు టీమిండియాకు గాయాల సమస్య పెద్ద సవాలుగా మారింది. భారత్–శ్రీలంక రెండు టెస్టుల సిరీస్ ఆగస్టు 15న గాలే వేదికగా ప్రారంభం కానుంది.

రెడ్ బాల్ క్రికెట్‌పై వైభవ్ సూర్యవంశీ ఫోకస్.. టెస్టుల్లో సత్తా చాటుతాడా?

15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి సంచలనాలు సృష్టిస్తున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు రెడ్ బాల్ క్రికెట్‌పై దృష్టి పెట్టాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 పరుగులు చేసిన వైభవ్.. ఆరెంజ్ క్యాప్‌తో పలు అవార్డులను సొంతం చేసుకున్నాడు. అంతకుముందు అండర్–19 ప్రపంచ కప్‌లోనూ 439 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనలతో అతి పిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన వైభవ్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే పొట్టి ఫార్మాట్‌లో అదరగొడుతున్న అతడు.. టెన్ట క్రికెట్‌లో రాణించగలడా? అనే ప్రశ్నలు వస్తున్నాయి.భారీ షాట్లకు అలవాటు పడిన వైభవ్.. సుదీర్ఘ ఫార్మాట్‌లో సత్తా చాటుతాడా? అని మాజీ క్రికెటర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎర్ర బంతిని ఎదుర్కొనే విషయంలో అతడి టెక్నిక్‌ను పరీక్షించాల్సి ఉంది. గత రంజీ సీజన్‌లో ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన వైభవ్ కేవలం 207 పరుగులు మాత్రమే చేశాడు. 17.25 సగటుతో ఒక అర్ధ శతకం కూడా సాధించలేకపోయాడు. అతడి అత్యధిక స్కోరు 83. అయినప్పటికీ వైభవ్ వెనక్కి తగ్గడం లేదు. సుదీర్ఘ ఫార్మాట్‌లో తనను తాను నిరూపించుకునేందుకు కసరత్తు చేస్తున్నాడు. త్వరలో జరగనున్న దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ డిప్యూటీగా వైభవ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నాగ్‌పూర్‌లో రాజస్థాన్ రాయల్స్ నిర్వహిస్తున్న 10 రోజుల క్యాంప్‌లో రెడ్‌బాల్ క్రికెట్‌పై ప్రత్యేకంగా సాధన చేస్తున్నాడు.టెస్టు క్రికెట్‌లో రాణించాలంటే సహనం, షాట్ ఎంపికలో స్పష్టత, ఎక్కువసేపు ఏకాగ్రతతో బ్యాటింగ్ చేయడం కీలకం. వైట్‌బాల్‌లో పవర్ హిట్టింగ్‌తో ఆకట్టుకున్న వైభవ్.. సుదీర్ఘ ఫార్మాట్‌కు అనుగుణంగా తన ఆటను మార్చుకోవాల్సి ఉంటుంది. ఇటీవల జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో 49 బంతుల్లో 83 పరుగులు చేయడం అతడి ఆటలో మార్పును సూచిస్తోంది. సాధారణంగా 220కుపైగా స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసే వైభవ్.. ఆ మ్యాచ్‌లో 169.38 స్ట్రైక్‌రేట్‌తో ఆడాడు. వయసు అతడికి అనుకూలంగా ఉన్నప్పటికీ.. టెస్టు క్రికెట్‌లో విజయవంతం కావాలంటే పవర్ హిట్టింగ్‌కు మించి తన ఆటను అభివృద్ధి చేసుకోవాలి. అందుకే ప్రస్తుతం వైట్‌బాల్ క్రికెట్‌కు దూరంగా రెడ్‌బాల్ ఆటపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాడు. మరి ఈ కుర్ర సంచలనం టెస్టుల్లోనూ తన ముద్ర వేస్తాడో లేదో చూడాలి.



హార్దిక్‌ను ట్రేడ్ చేస్తే.. ఆ ఇద్దరినీ జట్టులోకి తీసుకోండి.. ఎంఐకి అశ్విన్ సూచన

ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రేడ్‌పై ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది. వచ్చే సీజన్‌కు ముందు హార్దిక్‌ను చెన్నై సూపర్ కింగ్స్ లేదా కోల్‌కతా నైట్ రైడర్స్‌కు పంపేందుకు ఎంఐ ప్రయత్నిస్తోందన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. హార్దిక్‌ను కేకేఆర్‌కు ట్రేడ్ చేస్తే.. ప్రతిగా హర్షిత్ రాణా, రింకు సింగ్‌ను తీసుకోవాలని ముంబైకి సూచించాడు. ‘హార్దిక్ కేవలం సీఎస్కే లేదా కేకేఆర్‌లోనే చేరతాడని అనుకోవద్దు. సీఎస్కే నుంచి శివమ్ దూబెతో పాటు మరో పేసర్ వస్తాడనే చర్చ జరుగుతోంది. కేకేఆర్ నుంచి కామెరూన్ గ్రీన్‌ను ఇచ్చే అవకాశం ఉంది. అయితే గ్రీన్ వచ్చే ఏడాది యాషెస్‌పై దృష్టి పెడితే పరిస్థితి ఏంటి? నేను ముంబై ఇండియన్స్‌కి ఇచ్చే సూచన ఒక్కటే.. కేకేఆర్‌తో ఒక్క షరతుపై హార్దిక్‌ను ట్రేడ్ చేయాలి. హర్షిత్ రాణా, రింకు సింగ్ ఇద్దరినీ జట్టులోకి తీసుకోవాలి. అప్పుడే ముంబై మరింత బలపడుతుంది. హార్దిక్‌ను ట్రేడ్ చేసుకుంటే సీఎస్కే కంటే కేకేఆర్‌కే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. హార్దిక్ కేకేఆర్‌లో చేరితే ఆ జట్టు మరింత ప్రమాదకరంగా మారుతుంది. బ్యాటింగ్ విభాగం చాలా బలంగా తయారవుతుంది. సీఎస్కే.. దూబె, ఓ పేసర్‌ను ఇచ్చి హార్దిక్‌ను తీసుకుంటే బలపడుతుంది కానీ అజేయంగా మారదు. అందుకే ముంబై.. హార్దిక్ వెళ్లే జట్టు తమకంటే ముందుకు వెళ్లకుండా ఎలా అడ్డుకోవాలో ఆలోచించాలి’ అని అశ్విన్ సూచించాడు.హార్దిక్ పాండ్య 2015లో ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. 2022 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్‌కు వెళ్లి.. ఆ జట్టుకు తొలి సీజన్‌లోనే టైటిల్ అందించాడు. అనంతరం ముంబై తిరిగి అతడిని జట్టులోకి తీసుకుని కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. అయితే ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. 2024లో ముంబై పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలవగా.. 2025లో క్వాలిఫయర్–2 వరకు చేరుకుంది. 2026 సీజన్‌లో మాత్రం తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది.



చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్.. మూడు సార్లు 6 వికెట్లు



అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ వన్డే క్రికెట్‌లో చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్లో మూడుసార్లు ఆరు వికెట్ల ప్రదర్శన చేసిన తొలి స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. బ్రెడీ క్రికెట్ క్లబ్ వేదికగా ఐర్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో రషీద్ ఖాన్ (6/34) అదరగొట్టి ఈ ఘనత అందుకున్నాడు. గతంలో 2017 మార్చి 17న గ్రేటర్ నోయిడాలో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అఫ్గాన్ స్పిన్నర్ 9.3 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి 6 వికెట్లు సాధించాడు. అదే ఏడాది జూన్ 9న గ్రోస్ ఐస్లెట్‌లో వెస్టిండీస్‌పై 18 పరుగులే ఇచ్చి ఏకంగా 7 వికెట్లు పడగొట్టాడు.

10 ఏళ్ల నిరీక్షణ.. జావెలిన్ త్రోలో భారత్‌కు రెండో పతకం



అండర్ 20 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ అథ్లెట్ ఆశిష్ యాదవ్ అద్భుతం చేశాడు. ఈ ఈవెంట్ జావెలిన్ త్రో విభాగంలో రజతం సాధించాడు. దాదాపు పదేళ్ల తర్వాత ఆశిష్ రూపంలో జావెలిన్ త్రో విభాగంలో భారత్‌కు రెండో పతకం వచ్చింది. ఇదే ఈవెంట్‌లో పదేళ్ల క్రితం స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా స్వర్ణం సాధించాడు.తాజాగా ఆశిష్ రజత పతకం సొంతం చేసుకుని అండర్ 20 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో రెండో భారత్ అథ్లెట్‌గా నిలిచాడు. ఈ 19 ఏళ్ల యువ అథ్లెట్ మెరుగైన ప్రదర్శనే చేసి.. చివరకు విజయం సాధించాడు. సౌతాఫ్రికా అథ్లెట్ జాన్ హైడ్రిక్ హైమన్స్ 80.50 మీటర్ల దూరం విసిరి గోల్డ్ మెడల్ దక్కించుకున్నాడు. ఆశిష్ 74.09 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు.యాదవ్‌కు ఆది నుంచీ గట్టి పోటీనే ఎదురైంది. తొలి రౌండ్‌లో 69.96 మీ. మూడో త్రోలో 74.09 మీ. విసిరి తన సీజన్ బెస్ట్‌ను నమోదు చేశాడు. ఇక డొమినికాకు చెందిన అడ్డిసన్ జేమ్స్ 73.89 మీటర్లు విసిరి కాంస్య పతకంతో మూడో స్థానంలో నిలిచాడు. 2016లో పోలాండ్‌లోని బైడ్‌గోస్జ్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో నీరజ్ చోప్రా(86.48మీ) భారత్‌కు గోల్డ్ మెడల్ అందించాడు. ఇదే జావెలిన్ త్రోలో భారత్‌కు తొలి పతకం కావడం గమనార్హం.

క్రికెట్ ఆస్ట్రేలియాపై యాషీ గార్డనర్ భార్య రైట్ ఫైర్!



ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ యాషీ గార్డనర్ భార్య మోనికా రైట్ ఆదేశ క్రికెట్ బోర్డుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. యాషీ తన సహచర క్రీడాకారిణి జార్జియా వోల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుందనే ఆరోపణలపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించింది. గార్డనర్ తనను మోసం చేసిందని బహిరంగంగా ఆరోపించిన రైట్, ఆమెను వైస్ కెప్టెన్సీని తొలగించాలని కూడా అధికారులను డిమాండ్ చేసింది.’క్రికెట్ ఆఫ్ ఆస్ట్రేలియా(సీఏ) ఇతరులకు ఆదర్శంగా నిలవాలని భావిస్తే.. నైతిక ప్రమాణాలను పాటించాల్సిన బాధ్యత ఆ బోర్డుపై ఉంటుంది. గార్డనర్‌కు సీఏ బహిరంగంగా ఎందుకు ఏమీ హెచ్చరికలు ఇవ్వలేదో నాకు అర్థం కావడం లేదు. సీఏ బోర్డు అధికారుల మౌనం యాషీ, జార్జియాల అనైతిక బంధానికి మద్దతు ఇస్తున్నారని అర్థమా?. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి నాయకత్వ స్థానంలో కొనసాగకూడదు. కెప్టెన్లు ప్రమాణాలను నెలకొల్పాలని ఆశిస్తాము. కానీ గార్డనర్ ప్రవర్తన ఆ ప్రమాణాలకు చాలా దూరంగా ఉంది’ అని రైట్ పేర్కొన్నారు.అయితే, ఈ వ్యాఖ్యలపై క్రికెట్ ఆస్ట్రేలియా స్పందిస్తూ... ఈ అంశం అనేది వారి వ్యక్తిగతమైనదని పేర్కొంది. తమ ఆటగాళ్లలోని అన్ని సంబంధాలు, ప్రవర్తనలు ‘పని ప్రదేశంలో గౌరవం’ విధానానికి అనుగుణంగా ఉండేలా చర్యలు ఉంటాయని సీఏ స్పష్టం చేసింది. రైట్, గార్డనర్ ఏప్రిల్ 2025లో వివాహం చేసుకున్నారు. కానీ 2025 మహిళల వన్డే ప్రపంచ కప్ కోసం గార్డనర్ భారత్‌లో ఉన్నప్పుడు వారి మధ్య విభేదాలు వచ్చాయి. ఆ సమయంలో వోల్‌తో గార్డనర్‌కు వివాహేతర సంబంధం ఉందని రైట్ ఆరోపించడంతో, అప్పటి నుంచి వారిద్దరు విడిపోయారు.

వైభవ్ సూర్యవంశీలో ఉన్న ప్రత్యేకత అదే: శిఖర్ ధావన్

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసల వర్షం కురిపించాడు. 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి అద్భుతంగా రాణించడం గొప్ప విషయమని చెప్పాడు. వైభవ్‌లో నైపుణ్యంతో పాటు షాట్లు ఆడేందుకు అవసరమైన ధైర్యం కూడా ఉందని కొనియాడాడు.‘వైభవ్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం గొప్ప విషయం. ఐపీఎల్‌లోనూ అతడు అద్భుతంగా ఆడుతున్నాడు. ముఖ్యంగా ఫోర్లు, సిక్సర్లు కొట్టే విధానం చాలా బాగుంది. 15 ఏళ్ల వయసులోనే అలాంటి షాట్లు ఆడే ధైర్యం, మానసిక స్థైర్యం ఉండటం చాలా గొప్ప విషయం. వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను’ అని శిఖర్ ధావన్ వెల్లడించాడు.



హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతం

బిజెపి పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ముఖ్య సమావేశం. మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



తెలంగాణ పవర్ న్యూస్ హయత్ నగర్ డివిజన్ ఎల్బీనగర్ ఆగస్టు : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 10 నుండి 15 వరకు నిర్వహించనున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ముఖ్య సమావేశం నిర్వహించారు.

హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో డివిజన్ నాయకులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, యువ మోర్చా, మహిళా మోర్చా మరియు అనుబంధ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు మాట్లాడుతూ. దేశభక్తి అనేది కేవలం మాటల్లో కాకుండా ప్రతి ఒక్కరి ఆచరణలో కనిపించాలని, మన జాతీయ జెండా దేశ గౌరవానికి ప్రతీక అని అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసి, ప్రతి కుటుంబంలో దేశభక్తి భావాన్ని మరింత బలపరచాలని .

ఆగస్టు 10 నుండి 15 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని హయత్‌నగర్ డివిజన్‌లో ప్రతి బూత్ స్థాయి వరకు తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకొని ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

కార్యక్రమ నిర్వహణ, జాతీయ జెండాల పంపిణీ, ఇంటింటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం, ప్రజల్లో దేశభక్తి చైతన్యం కల్పించడం తదితర అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించారు.

మన జాతీయ జెండా మన ఆత్మగౌరవానికి ప్రతీక... మన దేశభక్తికి ప్రతిరూపం. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, కార్యక్రమం ఇంచార్జ్ రాజేంద్ర ప్రసాద్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, మహిళా అధ్యక్షురాలు గీత, నాయకులు జంజ్యు నాయక్, జనార్దన్,సురేష్, మధు సుధన్, సురేష్, గంగాని రాము, అమల్ నాయక్,పారంద సాయి, బాలు నాయక్, మొగులయ్య, శంకర్ నాయక్, శ్రీకాంత్, విష్ణు చారి, లక్ష్మణ్, అభిలాష్, మహిళా నాయకులు సుజాత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లో కాచిగూడాలో సరికొత్త ప్రత్యేక షోరూం ప్రారంభించిన రామరాజ్ కాటన్



హైదరాబాద్, ఆగస్టు 08, 2026: సంప్రదాయ తెల్లటి ధోవతులు, స్థానిక దుస్తులకు పేరు గాంచిన రామరాజ్ కాటన్ కాచిగూడాలో సరికొత్త ప్రత్యేక షోరూం ప్రారంభించింది. హైదరాబాద్ లో రిటైల్ దుకాణాలను మరింతగా విస్తరిస్తూ, ఈ ప్రాంత వినియోగదారులకు కాటన్ వస్త్రాలను మరింత అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ షోరూంను లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీ సురేష్ జగ్నానీ ప్రారంభించారు. శ్యాం మందిరం పూజారి శ్రీ రామ్ చరణ్ మహారాజ్ సంప్రదాయబద్ధంగా జ్యోతి వెలిగించారు. యజమాని శ్రీ కూనల్ గోయల్ షోరూంలో మొదటి కొనుగోలు చేశారు.

ఈ నూతన షోరూం వినియోగదారులకు రామరాజ్ కాటన్ శ్రేష్టమైన కాటన్ వస్త్రాలతో తయారు చేసిన విస్తృతశ్రేణి సంప్రదాయ, సమకాలీన వస్త్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నది. వినియోగదారులు బార్డర్ ఉన్న ధోవతులు, ముడతలు పడని ధోవతులు, సువాసనలు వెదజల్లే ధోవతులు, ఎంబ్రాయిడరీ ధోవతులు, మయిల్కన్ ధోవతులు, పంచకచం ధోవతులు, పట్టు దోవతులు వంటి బహు రకాల దోవతులను ఇక్కడ కొనుగోలు చేయవచ్చు. అలాగే ఈ స్టోర్ లో కాటన్ షర్టులు, ఎంబ్రాయిడరీ షర్టులు, లినెన్ షర్టులు, డిజైనర్ షర్టులు, పట్టు షర్టులు, ధోవతీ-షర్టు జోడీలూ వివిధ రంగులలో తీరులలో చూసుకోవచ్చు. ఇంతేకాకుండా ఈ షోరూంలో ధోవతులు, షర్టులతో పాటుగా బెల్టులు, రుమాళ్లు, సాక్స్, తువ్వాళ్లు, పురుషుల, మహిళల, పిల్లల లోదుస్తులు, వస్త్రాలు కూడా ఉంటాయి. మహిళలకు కాటన్, పట్టు చీరలు, లెగింగ్స్, ఇతర రకాలు ఉంటాయి. సంప్రదాయ, రోజువారీ వస్త్రధారణకు అవసరమైనవి సమగ్రంగా దొరుకుతాయి.

రామ్జ్ కాటన్ కల్చరైనర్, వ్యవస్థాపకులు, చైర్మన్ శ్రీ కే.ఆర్. నాగరాజన్ ఇలా అన్నారు "కాచిగూడాలో మా నూతన షోరూం రిటైల్ రంగంలో మా విస్తరణను, తెలంగాణాలో మా ఉనికిని గట్టిపరుస్తుంది. హైదరాబాద్ లో సంప్రదాయ వస్త్రధారణకు గాఢమైన ఆదరణ ఉన్నది. ఈ ప్రాంత వినియోగదారులకు విస్తృత పరిధిలో రామరాజ్ కాటన్ ధోవతులు, షర్టులు, సంప్రదాయ వస్త్రధారణను అందిస్తున్నందుకు మాకు సంతోషంగా ఉన్నది. నిజమైన, సౌకర్యవంతమైన, గుణాత్మక సంప్రదాయ వస్త్రాలను తేలికగా అందుబాటులోకి తీసుకురావడం మా లక్ష్యం. అదే విధంగా దేశవ్యాప్తంగా ఒక బలమైన రిటైల్ వ్యవస్థను నిర్మిస్తాం. మేం నూతన మార్కెట్లలోకి విస్తరిస్తూ భారతదేశ సుసంపన్న వస్త్ర సంప్రదాయాలను మరింత మంది వినియోగదారులకు అందించేందుకు కట్టుబడి ఉంటాము".

ఈ కొత్త షోరూం కాచిగూడలోను, సమీప ప్రాంతాలలోనూ వినియోగదారులకు సేవలు అందిస్తుందని ఆశిస్తాం. రామ్రాజ్ విస్తృత కాటన్ సంప్రదాయ, ఆధునిక స్థానిక వస్త్రాలను వారికి అందించేందుకు సౌకర్యవంతమైన ప్రదేశాన్ని అందిస్తుంది ఆశిస్తున్నారు.

టీసీసీబీఈఏ ఖమ్మం జిల్లా యూనిట్ మహాజన సభకు నాయకులకు ఆహ్వానం



ఖమ్మం, ఆగస్టు 8 – తెలంగాణ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎజజదీజూూ) ఖమ్మం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాజన సభకు రాష్ట్ర స్థాయి బ్యాంకు ఉద్యోగ సంఘం నాయకులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగాూూ×దీజూూ అధ్యక్షులు, ఎజజదీజూూ అధ్యక్షులు కామ్రేడ్ బి.ఎస్. రాంబాబు, ఎజజదీజూూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ కనకం జనార్దన్ రావు, ఎజజదీజూూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కామ్రేడ్ షేక్ అలీముద్దీన్, రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ పి. నాగేందర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ కామ్రేడ్ బి. ప్రవీణ్ కుమార్ తదితర నాయకులకు స్వాగతం పలికారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగుల హక్కులు, కార్మిక సంక్షేమం, సంఘటిత ఉద్యమం తదితర అంశాలపై మహాజన సభలో చర్చ జరిగే అవకాశం ఉందని సంఘం నాయకులు తెలిపారు.

"స్వాగతం -- సుస్వాగతం" అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో ఖమ్మం జిల్లా యూనిట్ మహాజన సభకు సన్నద్ధమవుతోంది. ూూ×దీజూూ, ఎజజదీజూూ నాయకుల రాకతో సభకు ప్రాధాన్యత ఏర్పడిందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అవసరం

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి



కరీంనగర్, ఆగస్టు 08: విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. చదువుతోపాటు ఇతర ప్రతిభలను వెలికితీసేందుకు అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో 12 గంటలపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న 9వ తరగతి విద్యార్థిని ఎం. స్నేహిత, 3వ తరగతి విద్యార్థిని అదితి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడం అభినందనీయమన్నారు. విజేతలకు పుష్పగుచ్ఛాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ సురేష్ షేట్కర్ జన్మదిన వేడుకలు

-రోగులకు పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ శ్రేణులు

-పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు

జహీరాబాద్ ఆగష్టు 8:: జహీరాబాద్ ఎంపి సురేష్ కుమార్ షెట్కర్ జన్మదినోత్సవాన్ని కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. స్థానిక ఆసుపత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల జన్మదిన వేడుకలను ఆర్భాటంగా కాకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి అండగా నిలవడం, వారు కష్టాల్లో భాగస్వామ్యం కావడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి,కౌన్సిలర్లు జహంగీర్, కవిత అశోక్, ఖాజామియా,



జమీలుద్దీన్, అక్రమ్, నాయకులు కండెం నరసింహులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కోహిర్ లో పారిశుధ్య సిబ్బందికి దుస్తులు, ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. ఎంపి శెట్కార్, ఇండస్ట్రీస్ మాజీ చైర్మన్ తన్వీర్ లకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ హన్నాన్ జావీద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, మాజీ వైస్ ఎంపిపి షాకీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

భట్రాజు మహిళల ఆధ్వర్యంలో ఘనంగా గోరింటాకు వేడుకలు



ఖమ్మం: ఖమ్మం పట్టణంలోని గోపాలపురంలో ఉన్న శబరీస్ బృందావన్ రిసార్ట్స్‌లో ఖమ్మం జిల్లా భట్రాజు మహిళా బంధువుల ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం రాష్ట్ర మహిళా విభాగం కార్యనిర్వాహక అధ్యక్షురాలు తోకచిచ్చు పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా కార్యవర్గ సభ్యులు, భట్రాజు మహిళా బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా విభాగం కార్యనిర్వాహక అధ్యక్షురాలు తోకచిచ్చు పద్మ మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం ఏకాదశి రోజున జిల్లాలోని భట్రాజు మహిళలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆనందోత్సాహాల మధ్య గోరింటాకు వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతో పాటు సంప్రదాయాలను భావితరాలకు అందించడమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో భాగంగా ముందుగా విఘ్నేశ్వర పూజ, గౌరీ పూజ, సరస్వతీ దేవి పూజ, సత్యసాయి పూజ నిర్వహించి అనంతరం సాయి హారతి ఇచ్చారు. అనంతరం హాజరైన మహిళలకు పసుపు, కుంకుమ, గంధం, పూలు, గాజులు అందజేసి, గోరింటాకు పెట్టుకుని సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని పాటలు, ఆటలతో సందడి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి రాళ్లబండి నిర్మల, కోశాధికారి సరికొండ విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి కూరపాటి సుమలత, కార్యవర్గ సభ్యులు కూరపాటి నాగమణి, కూరపాటి చంద్రావతి, కూరపాటి హరిప్రియ, తంగెళ్ల సుబ్బలక్ష్మి, సరికొండ శ్రీదేవి తదితరులతో పాటు సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్

పగటిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసి రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలతో పాటు నగదును దొంగిలిస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్న జగిత్యాల జిల్లాకు చెందిన వనం రాముని మంథని సీఐ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం, రామగిరి పోలీసులు అరెస్ట్ చేసినట్లు మంథని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ వెల్లడించారు. రామగిరి ఎస్సై టి.శ్రీనివాస్ తన సిబ్బందితో శనివారం గస్తీ నిర్వహిస్తున్న సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను పరిశీలిస్తూ నడుచుకుంటూ తిరుగుతున్న నిందితుడిని గుర్తించారన్నారు. పోలీసులను చూసి నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించగా అతని ప్రవర్తనపై అనుమానం రావడంతో తనిఖీ చేయగా అతని వద్ద ఒక బటన్ కత్తి లభించగా నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా,తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేసేందుకు వచ్చినట్లు అంగీకరించడంతో పాటు గతంలో తన సహచరులతో కలిసి పాల్పడిన పలు దొంగతనాల వివరాలను వెల్లడించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని, దొంగతనాలకు సంబంధించిన ఆస్తి రికవరీతో పాటు ఇతర నిందితుల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని ఏసీపీ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన మంథని సీఐ బి. స్వామి, రామగిరి ఎస్సై టి.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్ భార్గవ్, పోలీస్ కానిస్టేబుళ్లు డి.రమేష్, వి.అభిషేక్, బి.రాజ్‌కుమార్ లను ఏసీపీ మడత రమేష్ అభినందించారు



సినిమా

ఫౌజీ కోసం భారీ చార్మినార్ సెట్



నిరంతరాయంగా షూటింగ్ కోసం ప్లాన్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి-లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొంది స్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

డీప్‌ఫేక్ ఫోటోలపై మృణాల్ ఆగ్రహం



తక్షణం తొలగించకపోతే చర్యలు .కృత్రిమ మేధను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్‌ఫేక్ ఫోటోలు సెలబ్రిటీలను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ఇప్పుడు నటి మృణాల్ ఠాకూర్ ఈ డీప్‌ఫేక్ బారిన పడ్డారు. ఇటీవల ఎక్స్‌లోని ఒక పేజ్‌లో మృణాల్ మార్ఫింగ్ ఫోటోలు కన్పించాయి. అవి క్షణాల్లో వైరల్‌గా మారాయి. తాజాగా వీటిపై నటి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నా డీప్‌ఫేక్ ఫోటోలను క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మృణాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇకపై ఈ ఫోటోలను ఎవరు షేర్ చేసినా.. వారిపై కూడా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గతంలో రష్మికతో పాటు పలువురు హీరోయిన్లు ఇలాంటి ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ కంటెంట్ బారిన పడిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో కొందరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటి ఫోటోలపై పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత హేయమైన చర్య అని అన్నారు. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా ఉండటానికి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



కరుప్పు విడుదల సమయంలో ఆర్థిక ఇబ్బందులు

జ్యోతికి సమయానికి అదుకుందన్న సూర్య



ఇటీవల 'కరుప్పు'తో విజయాన్ని అందుకున్నారు అగ్ర కథానాయకుడు సూర్య. అయితే ఈ సినిమా సమయంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అందించిన మద్దతును తాజాగా గుర్తు చేసుకున్నారు. ఓ అంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఈ అంశంపై మాట్లాడారు. కరుప్పు సినిమా విడుదలకు ముందు చివరి నిమిషంలో ఆర్థిక పరమైన, పంపిణీ సమస్యలు ఎదురయ్యాయి. ఆ సమయంలో సినిమాను థియేటర్లలో ప్రదర్శించడం కోసం అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. అది మా కుటుంబానికి పెద్ద రిస్క్. కానీ, జ్యోతిక నాపై ఉంచిన నమ్మకమే నేను ధైర్యంగా ముందడుగు వేసేలా చేసింది. ఆ రిస్క్ విషయంలో ఆమె నాకు కొండంత అండగా నిలిచిందని సూర్య పేర్కొన్నారు. దీనిపై ఇదే ఇంటర్వ్యూలో జ్యోతిక స్పందిస్తూ.. ఆ సినిమా విషయంలో పూర్తి ఘనత సూర్యకే చెందుతుందన్నారు. నేను ఈ ప్రశంసను స్వీకరించను. మేము ఏ నిర్ణయమైనా కలిసే తీసుకుంటాం. పిల్లల పెంపకం విషయంలోనూ మేమిద్దరం ఎప్పుడూ ఒకే అభిప్రాయంతో ఉంటాం. ముందు మేం చర్చించుకుని తర్వాత పిల్లలకు వివరిస్తాం అని తెలిపారు. ఇక 'కరుప్పు' గురించి సూర్య మాట్లాడుతూ.. ఆర్.జే బాలాజీ ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు రెండున్నర సంవత్సరాలు కష్టపడ్డారని అన్నారు. ఈ సినిమా విజయం చాలా మంది జీవితాలను మార్చేసిందని తెలిపారు. త్రైనాన్నియర్లు కూడా సహకరించారని వెల్లడించారు. సూర్య, త్రిష ప్రధానపాత్రల్లో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది.



రామాయణపై అనుమానాలు ఉన్నాయి

విడుదలకు ముందే చూపిస్తే మంచిది



నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న 'రామాయణ' చిత్రం విడుదలకు ముందే వివాదంలో చిక్కుకుంది. దిల్లీలోని శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ అధ్యక్షుడు అర్జున్ కుమార్ ఈ సినిమాపై ఆందోళనను వ్యక్తం చేస్తూ.. చిత్ర బృందానికి లేఖ రాశారు. సినిమా విడుదలయ్యే ముందే తమకు చూపించాలని.. లేదంటే నిరసనలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ చిత్రం హిందూ మత విశ్వాసాలను, మనోభావాలను దెబ్బతీసేలా ఉండకూడదనే ఉద్దేశంతో లేఖ రాస్తున్నట్లు అర్జున్ కుమార్ వివరించారు. టీజర్, ట్రైలర్ చూసిన తర్వాత తమకు కొన్ని విషయాల్లో అసంతృప్తి కలిగిందని ఆయన తెలిపారు. 'మేము ఈ సినిమాను స్వాగతిస్తున్నాం. లక్షలాది మంది ప్రజలు దీనిని చూడాలని కోరుకుంటున్నాం. రామ్‌లీలా కమిటీ సభ్యుల కోసం ఉచిత ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తాం. అయితే, ట్రైలర్ మాకు కొంత బాధ కలిగించింది. అందులో కొన్ని భావోద్వేగాలు సరిగ్గా లేవని మాకు అనిపించింది. అలాగే, నటీనటుల కాస్ట్యూమ్స్ కూడా కొన్ని సన్నివేశాల్లో ఆమోదయోగ్యంగా లేవు. అందుకే ఈ సినిమా విడుదలకు ముందు మాకు కచ్చితంగా చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో వచ్చిన వ్యతిరేకత నేపథ్యంలో.. ఈసారి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 'రామాయణ' సినిమాలో కొన్ని సన్నివేశాలు/సంభాషణలు అభ్యంతరకరంగా ఉండే అవకాశం ఉందనే సమాచారం తమకు అందిందని, అందుకే ముందుగానే స్క్రీనింగ్ నిర్వహించి వాటిని తొలగించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తమ అభ్యర్థనను మేకర్స్ పట్టించుకోకుండా.. సినిమాలో అభ్యంతరకర అంశాలు ఉంటే థియేటర్‌లలో నిరసనలు చేపడుతామని అర్జున్ కుమార్ హెచ్చరించారు.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844